JANA SAINYAM

# జనసైన్యం

ప్రజల పక్షం జనసైన్యం

తెలుగు దినపత్రిక



కరీంనగర్ జిల్లా. సంపుటి 3. సంచిక 332 21 మంగళవారం జూలై 2026 ఎడిటర్ గుంటపల్లి స్వామి https://epaper.janasainyam.in పేజీలు: 12 రూ.5

## ఆర్టీసీ రాయితీ మాయాజాలం జర్నలిస్టుల జేబులకు చిల్లు !




జనసైన్యం సిటి

ప్రజా సమస్యల పరిష్కారం కోసం, సమాజ హితం కోసం అహర్నిశలు శ్రమించే జర్నలిస్టులకి ఆర్టీసీ షాక్ ఇస్తోంది. జర్నలిస్టులకు ఇచ్చే ప్రయాణ రాయితీల్లో నిశ్శబ్దంగా కోత విధిస్తూ, వారిపై అదనపు భారాలు మోపుతోంది. గతంలో అమలైన 1/3 (మూడో వంతు) రాయితీని కాగితాలకే పరిమితం చేస్తూ, క్షేత్రస్థాయిలో సగం కంటే ఎక్కువ ధరను వసూలు చేస్తుండటంతో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న జర్నలిస్టులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్టేట్ అక్రిడిటేషన్ నిబంధనల ప్రకారం జర్నలిస్టులకు టికెట్ ధరలో కేవలం 33 నుండి 35 శాతం మాత్రమే వసూలు చేయాలి. కానీ, ప్రస్తుతం ఆర్టీసీ దాదాపు 50 శాతం (1/2 ధర) కంటే ఎక్కువే వసూలు చేస్తోంది. బస్సు పాస్‌ల మీద స్పష్టంగా 1/3 రాయితీ అని ముద్రిస్తున్న అధికారులు, టికెట్ ఇష్యూయింగ్ మిషన్లలో (టిమ్స్) మాత్రం ఆ మేరకు సాఫ్ట్‌వేర్ అప్‌డేట్ చేయకపోవడమే ఈ దోపిడీకి కారణమని తెలుస్తోంది.

**ఎక్స్‌ప్రెస్, ఎలక్ట్రిక్ బస్సుల్లో చుక్కలు....**

సాధారణ పల్లె వెలుగు బస్సుల కంటే ఎక్స్‌ప్రెస్, ఎలక్ట్రిక్ సర్వీసుల్లో జర్నలిస్టులకు రాయితీ భారం భారంగా మారింది. ఎక్స్‌ప్రెస్ సర్వీసుల్లో వీటిలో జర్నలిస్టుల నుంచి ఏకంగా 53 శాతం నుండి 55 శాతం వరకు టికెట్ ధర వసూలు చేస్తున్నారు. అంటే రాయితీ 50 శాతం కూడా ఉండటం లేదు. ఎలక్ట్రిక్ బస్సుల్లో పర్యావరణ హితం పేరిట వచ్చిన ఈ బస్సుల్లో జర్నలిస్టులకు అసలైన షాక్ తగులుతోంది. ఇక్కడ ఏకంగా 60 శాతం ధర వసూలు చేస్తూ, కేవలం 40 శాతం రాయితీతోనే సరిపెడుతున్నారు.

**కండక్టర్లతో వాగ్వివాదాలు.. మిషన్లదే తప్పు!**

బస్సుల్లో రాయితీపై కండక్టర్లను ప్రశ్నిస్తే.. మేమేం చేయలేం.. మిషన్లలో (టిమ్స్) ఫీడింగ్ ఎలా ఉంటే అలాగే టికెట్ వస్తుందని వారు చేతులెత్తేస్తున్నారు. రాయితీ లెక్కల్లో స్పష్టత లేకపోవడంతో నిరంతరం జర్నలిస్టులకు, కండక్టర్లకు మధ్య వాగ్వివాదాలు చోటుచేసుకుంటున్నాయి. దూరాన్ని బట్టి లెక్కించాల్సిన రాయితీలు అస్తవ్యస్తంగా మారుతున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాల నుంచి వార్తల సేకరణ కోసం జిల్లా కేంద్రాలకు, ఇతర పట్టణాలకు నిరంతరం ప్రయాణించే విలేకరులకు ఈ టికెట్ భారం గుదిబండగా మారింది. అతి తక్కువ జీతాలతో పని చేసే జర్నలిస్టులు, తమ సంపాదనలో ఎక్కువ భాగం ప్రయాణాలకే వెచ్చించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**జర్నలిస్టు సంఘాల డిమాండ్..**

ఆర్టీసీ యాజమాన్యం తక్షణమే స్పందించి అన్ని రకాల బస్సుల్లో (ఎక్స్‌ప్రెస్, ఎలక్ట్రిక్ సహా) పాత పద్ధతిలో మూడోవంతు రాయితీని పక్కాగా అమలు చేయాలని జర్నలిస్టులు, జర్నలిస్టు సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. యూజర్ చార్జీల నుంచి జర్నలిస్టులకు మినహాయింపు ఇవ్వాలని, టికెట్ మిషన్లలో సాఫ్ట్‌వేర్ లోపాలను సరిదిద్దాలని కోరుతున్నాయి. ప్రభుత్వ పెద్దలు స్పందించి ఈ రాయితీ కోతకు అడ్డుకట్ట వేయాలని జర్నలిస్టులు కోరుతున్నారు.

## ఉద్యమంలా 'తెలంగాణ జలసిరి' కార్యక్రమం చేపట్టాలి




జనసైన్యం సిటి

ఎల్ నినో ప్రభావంతో ఏర్పడే వర్షాభావ పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'తెలంగాణ జలసిరి' కార్యక్రమాన్ని ఉద్యమంలా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా అధికారులకు పిలుపునిచ్చారు. వీబీజీ రామ్-జీ పథకం కింద గ్రామాల్లో ఇంకుడుగుంతలు, ఊట కుంటలు, పంట కుంటలు, బోరు బావుల రీఛార్జ్ నిర్మాణాలు చేపట్టి ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు.సోమవారం కలెక్టరేట్ ప్రజావాణి సమావేశ మందిరంలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో తెలంగాణ జలసిరి పోస్టర్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ డిప్యూటీ కమిషనర్ అనిల్ కుమార్, అదనపు కలెక్టర్లు శ్రీనివాస్ రెడ్డి, అశ్విని తానాజీ వాకడే, డీపీఓ జగదీశ్వర్, డీఆర్డీఓ గీతతో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, వర్షాభావ పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ నీటిని పొదుపుగా వినియోగించాలని కోరారు. రానున్న రోజుల్లో నీటి కొరతను ఎదుర్కొనేందుకు ప్రతి వర్షపు చుక్కను భూమిలోకి ఇంకించి భూగర్భ జలాలను పరిరక్షించాలని అన్నారు.వీబీజీ రామ్-జీ పథకం కింద ప్రభుత్వం ఇంకుడుగుంతలు, పంట కుంటలు, ఊట కుంటలు, బోరు బావుల రీఛార్జ్ వంటి నీటి సంరక్షణ పనులు చేపడుతోందని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గ్రామస్థాయిలో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు.గ్రామీణ ప్రాంతాల్లో నీటి సంరక్షణ, సహజ వనరుల అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ, స్థిరమైన గ్రామాభివృద్ధి లక్ష్యంగా వీబీజీ రామ్-జీ కార్యక్రమాన్ని అన్ని శాఖల సమన్వయంతో అమలు చేయనున్నట్లు కలెక్టర్ తెలిపారు. పంచాయతీరాజ్, వ్యవసాయ, ఉద్యానవన, భూగర్భ జలాలు, గనులు-భూగర్భ శాస్త్రం, మత్స్య, ప్రణాళిక, విద్యుత్ శాఖలతో పాటు స్వచ్ఛ భారత్ మిషన్ (గ్రామీణం) అధికారులు పరస్పర సహకారంతో వివిధ అభివృద్ధి పనులను చేపట్టాలని సూచించారు. ఈ సమావేశంలో వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.


## ప్రజావాణి దరఖాస్తులను పెండింగ్ లో ఉంచొద్దు.




జనసైన్యం సిటి

ప్రజావాణి దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి సత్వరం పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ చిత్రమిశ్రా.. ఆయా శాఖల అధికారులను ఆదేశించారు.సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో ప్రజావాణి నిర్వహించగా.. అదనపు కలెక్టర్లు అశ్విని తానాజీ వాకడే, శ్రీనివాస్ రెడ్డి, వివిధ శాఖల ఉన్నతాధికారులతో కలిసి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ప్రజావాణి కి మొత్తం 313 దరఖాస్తులు రాగా అత్యధికంగా గృహ నిర్మాణ శాఖకు 100 దరఖాస్తులు వచ్చినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 30 రోజులకు పైబడి పెండింగ్ లో ఉన్న దరఖాస్తులను సత్వరం పరిష్కరించాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. కోర్టు కేసులు, సీఎం ఆఫీస్, ట్విట్టర్లో వచ్చిన ఫిర్యాదులను క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. పరిష్కరించిన దరఖాస్తుల వివరాలను లాగిన్ లో అప్డేట్ చేయాలని అధికారులకు సూచించారు.




## మహిళా ఉద్యోగిపై లైంగిక వేధింపులకు పాల్పడుతున్న ఉద్యోగులను సస్పెండ్ చెయ్యాలి




కరీంనగర్ మున్సిపల్ కార్యాలయంలో కొందరు ఉద్యోగులు కార్యాలయంలో పనిచేస్తున్న మహిళ ఉద్యోగినిని లైంగికంగా వేధిస్తూ తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని వీరిని వెంటనే ఉద్యోగం నుండి తొలగించాలని సోమవారం రోజున జనసేన పార్టీ కరీంనగర్ నియోజకవర్గం నాయకులు కాస రాజు ఆధ్వర్యంలో కరీంనగర్ నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ కి వినతి పత్రం అందజేయడం జరిగింది.


ఈ సందర్భంగా నాయకులు రాజీ రెడ్డి, కాస రాజు మాట్లాడుతూ... మున్సిపల్ కార్యాలయంలో ఎన్నడు లేని విధంగా లైంగిక వేదింపులు ఆరోపణలు రావడం చాలా బాధాకరమని ఉద్యోగులు తమ పని తను చేసుకునే సందర్భంలో మహిళా ఉద్యోగులపై లైంగిక వేధింపులకు పాల్పడి ఇష్టం వచ్చినప్పుడు ఫోన్ చేయడం, బెదిరించడం ఏదో పని చెప్పి నువ్వు పని చేస్త లేవు నీపై ఉన్నత స్థాయి అధికారులకుపిర్యాదు చెప్తామని చెప్పి లొంగదీసుకునే ప్రయత్నం చేయడం దుర్మార్గమైన చర్య అని ఆరోపించారు. మహిళలకు ఎంత భద్రత ఉందో అర్థం అవుతుంది అన్నారు. నిత్యం ఏదో ఒక పనిమీద వందలాదిమంది మహిళలుమున్సిపల్ కార్యాలయానికి వస్తారని ఇలాంటి సంఘటనలు బయట తెలిస్తే రావడానికి కూడా భయపడతారని పేర్కొన్నారు. మేము చెప్పిన చోటికి రాకుంటే నీ ఉద్యోగం పీకేస్తామని హుకుంజారీ చేసి లొంగదీసుకోవాలనేటువంటి కుట్రలకు పాల్పడడం సిగ్గుచేటు చర్య అని ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో మహిళ ఉద్యోగులను వేధింపులు చేస్తున్నారని ఉన్నతాధికారులకు చెబితే నీవు అధికారులకు చెపుతావా అని బెదిరించి ఇంకా ఎక్కువ వేధింపులు గురి చేస్తున్నారని అన్నారు. వెంటనే మహిళ ఉద్యోగినిని వేధింపులకు గురి చేస్తున్న ఉద్యోగులను వెంటనే సస్పెండ్ చేయాలని, వారిపై శాఖ పరమైన చర్యలు తీసుకోవాలని జనసేన నాయకులు కాస రాజు డిమాండ్ చేశారు. స్పందించిన మేయర్ ఈ సమస్య పైన కలెక్టర్ గారి దృష్టికి తీసుకెళ్లామని కలెక్టర్ గారితో రేపు చర్చించి వారిపై శాఖ పరమైన చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు, వీర్ల శ్రీనివాస్, అన్వేష్ రెడ్డి, పొన్నాల తిరుపతి, మహాదేవ రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## తక్కువ నీటితో పండే పంటలపై అవగాహన కల్పించాలి




తక్కువ నీటితో సాగు అయ్యే పంటలపై రైతులకు అవగాహన కల్పించాలని నల్గొండ జిల్లా ఇన్ చార్జీ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. ఎల్ నియో ప్రభావంపై ఉమ్మడి నల్గొండ, సూర్యాపేట, యాదాద్రి భువనగిరి జిల్లాల్లో చేపట్టాల్సిన చర్యలు, ప్రత్యామ్నాయ పంటల ప్రోత్సాహం, తాగునీరు, సాగునీటి నిర్వహణతో పాటు ఇతర సంబంధిత అంశాలపై నల్గొండ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ఉన్నతస్థాయి సమీక్ష సమావేశంలో తెలంగాణ రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి, నల్లగొండ జిల్లా ఇంచార్జ్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పాల్గొన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర మంత్రులు ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, ప్రజాప్రతినిధులు, ఎమ్మెల్యేలు, మూడు జిల్లాల కలెక్టర్లు, వ్యవసాయ, ఉద్యానవన, నీటిపారుదల, పశుసంవర్ధక తదితర శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ.. ఎల్‌నియో ప్రభావంతో ఏర్పడే పరిస్థితులను ముందుగానే అంచనా వేసి, రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రభుత్వం అన్ని శాఖల సమన్వయంతో కార్యాచరణ ప్రణాళికను అమలు చేస్తోందని తెలిపారు. రైతులు స్థానిక పరిస్థితులకు అనుగుణంగా తక్కువ నీటితో సాగు చేయగల ప్రత్యామ్నాయ పంటలను ఎంచుకునేలా వ్యవసాయ శాఖ అధికారులు విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. విత్తనాలు, ఎరువులు, సాగునీటి నిర్వహణ, తాగునీటి సరఫరా, పశుగ్రాసం వంటి అంశాలపై ముందస్తు ప్రణాళికతో చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వ యంత్రాంగం అప్రమత్తంగా పనిచేయాలని, మూడు జిల్లాల అధికారులు పరస్పర సమన్వయంతో పరిస్థితులను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ అవసరమైన చర్యలు చేపట్టాలని మంత్రి సూచించారు.

## కట్టరాంపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించిన డిప్యూటీ మేయర్




బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, కరీంనగర్ నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్, మాజీ మేయర్ యాదగిరి సునీల్ రావు సోమవారం రోజు కట్టరాంపూర్ లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఆసుపత్రిలోని పరిస్థితులను, రోగులకు అందుతున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులతో సునీల్ రావు స్వయంగా మాట్లాడి.. వారికి అందుతున్న వైద్య సేవలు, ఆసుపత్రిలో కల్పిస్తున్న సదుపాయాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలో అందుతున్న సేవల పట్ల ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రతిరోజూ ఆసుపత్రికి ఎంత మంది రోగులు వస్తున్నారు, ప్రధానంగా ఎలాంటి అనారోగ్య సమస్యలతో వస్తున్నారు అనే వివరాలను వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం నమోదవుతున్న కేసులలో డెంగ్యూ, మలేరియా, కుక్క కాట్లు, కోతి కాట్లు ఇతర వైరల్ జ్వరాల తీవ్రత ఏ విధంగా ఉందని ఆరా తీశారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉంటూ, రోగులకు తక్షణమే సరైన చికిత్స అందించాలని సూచించారు.

పేద, మధ్యతరగతి ప్రజలు ప్రభుత్వ వైద్యంపై ఎంతో నమ్మకంతో ఇక్కడికి వస్తారని, ఆ నమ్మకాన్ని వమ్ము చేయకుండా సమయపాలన పాటిస్తూ మెరుగైన సేవలు అందించాలని వైద్య సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. ఆసుపత్రి నిర్వహణలో గానీ, వైద్య సేవలు అందించడంలో గానీ ఏవైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని, వాటి పరిష్కారానికి పూర్తిస్థాయిలో కృషి చేస్తానని ఆయన వైద్యులకు భరోసా ఇచ్చారు. ప్రభుత్వ ఆసుపత్రుల పట్ల ప్రజల్లో ఉన్న విశ్వాసాన్ని మరింత పెంచేలా భవిష్యత్తులో కూడా ఇదే విధమైన నాణ్యమైన సేవలు కొనసాగించాలని సునీల్ రావు సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ సాయిరాజ్, వైద్య సిబ్బంది సాగర్, పావని, శ్వేత , సుమతి మరియు చల్మెడ హాస్పిటల్ ట్రైని డాక్టర్స్ తదితరులు పాల్గొన్నారు.

# ముక్క..చుక్క..!



గ్రామీణం గానం చేస్తున్నది..
ముక్క, చుక్కల 'సారా' పాటలు
ఊళ్లల్లో ఏరులై పారుతోంది..
ఆల్కహాల్ మత్తు వరద ప్రవాహాలు !
ఊరు వాడ ఊగి తూగుతోంది
ఇండ్లల్లో మత్తు గమ్మత్తు గొడవలు
కంచాల్లో పచ్చడి మెతుకులు కరువు
మత్తు మందుకు లేదెపుడూ కరువు !
చుక్క గొంతులోంచి జారాలంటే..
నాలు ముక్క, బొక్క కావల్సిందే
చుక్క దిగనిదే మాటరాని జనాలు
ముక్కలేనిదే ముద్ద దిగని రోజులు !
మందు తాగనోడు మనిషే కాదని..
ముక్క పట్టనోడు చుట్టమే కాదని..
ముక్క, చుక్క కలిస్తేనే ఆత్మబంధువని..
నిర్వచించే మత్తు గమ్మత్తుల రోజులు !
తెలుగు పల్లెలు, పట్నాల్లో..

ఏరులై పారుతున్న మత్తు పెగ్గులు
గుప్పు మంటున్న 'దారు' మత్తులు
పల్లెంలో మూలుగు బొక్కల శబ్దాలు !
పంట పండితే మత్తు పార్టీలు
దిగుబడి దిగులుతో మందు పార్టీలు
చుట్టం వస్తే ముక్క చుక్కలే మర్యాదలు
వాడ వాడల్లో వెలిసె బెల్ట్ షాపులు !
తూలుతున్న ఊరి యువతరాలు
మందు తాగి బక్కచిక్కిన దేహాలు
లివర్ కాలిపోయి చావుబతుకులు
ఊళ్లో సగానికి పైగా వితంతువులే !
గంజాయి ప్యాకెట్ల దుర్వ్యసనాలు
సిగరెట్ల గుప్పు గుప్పు విషపు పొగలు
చుక్క దిగి దిగజారిన సుస్తీ యువకులు
భవిష్యత్తుకే పెను ప్రమాద హెచ్చరికలు !

మధుపాళీ

# కాంగ్రెస్ పార్టీలో పలువురి చేరిక.




38 వార్డులో ఇండిపెండెంట్ కౌన్సిలర్ అభ్యర్థిగా పోటీ చేసిన వద్నాల శ్రీనివాస్ గారు ఈరోజు కాంగ్రెస్ పార్టీలో వారి నాయకత్వంలో కొంతమంది యువకులతో కలిసి జిల్లా అధ్యక్షులు సంగీతం శ్రీనివాస్ గారి పట్టణ అధ్యక్షులు సూర దేవరాజు గారి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో పలువురు చేరారు. ఈసందర్భంగా సంగీతం శ్రీనివాస్ మాట్లాడుతూ ఓటు హక్కు మనకెంతో కీలకమని బి ఎల్ ఓ ఇచ్చిన ఫామ్ ను నింపి అధికారులకు ఇచ్చి సరిగా ఉందో లేదో అని తెలుసుకోవాలి ఫామ్ ను నింపి ఇవ్వనివారు గడువులోగా నింపి ఇవ్వాలి లేకుంటే మీ ఓటుకు పోయే ప్రమాదం ఉంటుంది జాగ్రత్తగా మీ ఓటు హక్కు కాపాడుకునే బాధ్యత మన పైన ఉంటుందన్నారు . మన కాంగ్రెస్ పార్టీ నుండి SIR హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేశామని ప్రతి బూత్ లో ఏజెంట్ ఉంటారని ఫామ్ నింపడానికైనా ఇంకేమైనా డౌట్స్ ఉన్నా కూడా వారిని కూడా సంప్రదించాలని కోరారు.పట్టణ అధ్యక్షుడు సూర దేవరాజు మాట్లాడుతూ రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయడం కోసం నూతన వార్డు అధ్యక్షుల నియామక ప్రక్రియను ప్రారంభించామని, పట్టణంలోని పలు వార్డుల్లో పర్యటనలు నిర్వహిస్తూ దరఖాస్తులను స్వీకరిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు సంగీతం శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరైయ్యారు.సంగీతం శ్రీనివాస్, సూర దేవరాజు వార్డు నాయకులు కార్యకర్తల అభిప్రాయాలు తెలుసుకొని"పార్టీ కోసం నిబద్ధతతో పనిచేస్తూ, సంస్థాగత బలోపేతానికి శ్రమించే నాయకులు, కార్యకర్తలకే వార్డు అధ్యక్షులుగా అవకాశం కల్పిస్తామని అన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి రాగుల జగన్ మాట్లాడుతూ ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలను క్షేత్రస్థాయిలో ప్రజల్లోకి తీసుకెళ్లడం.ప్రజల్లో పార్టీ పట్ల మరింత మద్దతును కూడగట్టడం అర్హులకు సంక్షేమ పథకాలు అందేటట్లు చూడాల్సిన బాధ్యత మన పై ఉందని అన్నారు.కార్యకర్తలు అధ్యక్షుల చెప్పిన పేర్లను క్షుణ్ణంగా పరిశీలించి, త్వరలోనే అర్హులైన నాయకులకు ఆయా వార్డుల బాధ్యతలను అప్పగించనున్నట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయన్నారు. కార్యక్రమంలో సామల రోజా వేముల దామోదర్ మేకల కమలాకర్ గౌరిటాల కుడికాల రవి తాటికొండ శ్రీనివాస్ చిప్ప పెంటయ్య కోదూరి దత్తు తాటికొండ తాటికొండ శ్రీనివాసు రవి పాల్గొన్నారు.

# రన్నింగ్ కాలమ్

చతురత తెలివికి
మారుపేరు చదరంగం
బల్లపై పరుచుకున్న
ఆటవిడుపు రణరంగం

ఎత్తుకు పై ఎత్తులే
అందించును గెలుపు
ఏమరుపాటుగా ఉంటే
తప్పదు ఓటమి సలుపు



-పెనుగొండ బసవేశ్వర్..

# జంక్ ఫుడ్‌తో జరజాగ్రత్త డిజిటల్ నరుడా !

ఆచార్య : బుర్ర మధుసూదన్ రెడ్డి

(21 జూలై "జాతీయ జంక్ ఫుడ్ వ్యతిరేక దినం" సందర్భంగా)



పాశ్చాత్య దేశాలు వంటింటికి ఎప్పుడో విడాకులు ఇచ్చాయి. వారి ఇండ్లల్లో జంక్ ఫుడ్స్ దండయాత్ర చేశాయి. ఒక్క పూట కూడా జంక్ ఫుడ్ లేకుండా దినం గడవడం లేదు. 'జంక్' అంటేనే 'చెత్త' అని కదా అర్థం. 1950 తర్వాత మైక్రోబయాలజిస్ట్ మైఖేల్ జాకబాసన్ రూపొందించిన పదం "జంక్ ఫుడ్" నేడు విశ్వవ్యాప్తం అయ్యింది. పెద్ద పెద్ద మాల్స్ నుంచి చిన్న చిన్న పాన్ కొట్ల వరకు అంతటా జంక్ ఫుడ్ ప్యాకెట్ దండలే స్వాగతం పలుకుతున్నాయి. చిన్న, పెద్ద అందరూ తరుచుగా ఏదో ఒక సందర్భంలో జంక్, ఫాస్ట్, ప్రాసెస్డ్ అండ్ ప్యాకెట్ ఫుడ్స్‌ను అమితానందంగా రుచు చూస్తున్నారు పిల్లలు మాత్రం జంక్ ఫుడ్ విషవలయంలో చిక్కినట్లే కనిపిస్తున్నది.

**జంక్ ఫుడ్‌తో పోతున్న ప్రాణాలు:**

మన ఆహారపు అలవాట్లే మన ఆరోగ్యాన్ని శాసిస్తాయి. ఆధునిక వేగవంతమైన జీవనశైలిలో నేటి మానవుడు కొట్టుకుపోతున్నాడు. ఫ్యాషన్ల పేరుతో జంక్ ఫుడ్‌ను లొట్టలేసుకుంటూ ఆరగిస్తున్నాడు, ఆరోగ్యాలను పాడు చేసుకుంటున్నాడు. నేటి డిజిటల్ నరుడు జంక్, ఫాస్ట్ ఫుడ్స్‌కు బానిస అయిపోయి తమ తమ ఆరో గ్యయాలను గాలికి వదిలేస్తున్నాడు. జంక్, ఫాస్ట్ ఫుడ్స్‌కు చరమగీతం పాడాల్సిన సమయం ఆసన్నమైందని, జంక్ ఫుడ్ పట్ల జనాల్లో అవగాహన కల్పించవలసిన అగత్యం ఏర్పడిందని గమనించిన అంచర్జాతీయ సమాజం ప్రతి ఏట 21 జూలై రోజున "జాతీయ జంక్ ఫుడ్ వ్యతిరేక దినం (నేషనల్ జంక్ ఫుడ్ డే)" పాటించడం ఆనవాయితీగా మారింది. సాలీనా సగటున పొగాకు దురలవాట్లతో 8 మిలియన్ల ప్రజలు మరణిస్తే, జంక్ ఫుడ్ అతిగా తీసుకోవడం వల్ల 11 మిలియన్ల ప్రజలు మరణిస్తున్నారని గణాంకాలు తెలుపుతున్నాయి. 70 ఏండ్లు పైబడిన వృద్ధుల్లో సహితం 22 శాతం మరకలు జంక్ ఫుడ్ తీసుకోవడం వల్ల జరిగినట్లు స్పష్టం అవుతోంది.

**జంక్ ఫుడ్ అనగా ఏమిటి ? వాటి దుష్ప్రభావాలు ఏమి ?**

అధిక కొవ్వులు, చక్కెరలు, ఉప్పు, క్యాలరీలతో పాటు అతి తక్కువ పోషక విలువలు కలిగిన ఆహార పదార్థాలను జంక్ అండ్ ఫాస్ట్ ఫుడ్ అని నిర్వచిస్తారు. తొలుత అమెరికాలో కాలుమోపిన జంక్ ఫుడ్ సంస్కృతి నేడు విశ్వవ్యాప్తం అయ్యింది. పెద్ద పెద్ద మాల్స్‌లో జంక్, ఫాస్ట్, ప్రాసెస్డ్, ప్యాకేజ్డ్, బేకరీ, ఫ్రోజెన్ ఫుడ్స్ వినియోగదారులకు నోరూరిస్తూ, వారిని బుట్టలో వేసుకుంటున్నాయి. డిజిటన్ నరులు ప్రయాణాలు అధికంగా చేయడం, భార్యాభర్తలు ఉద్యోగాలు చేయడం, ఆర్థికంగా బలపడడం, బజారు రుచులకు అలవాటు పడడం లాంటి అవలక్షణాలతో జంక్ ఫుడ్ విప్లవం కొనసాగుతున్నది. డీప్ ఫ్రై లేదా అతి వేపుడు చేసిన జంక్ అండ్ ఫాస్ట్ ఆహారం తీసుకోవడం వల్ల స్థూలకాయం లేదా అధిక బరువు, మధుమేహం/బిపీ లాంటి జీవనశైలి రుగ్మతలు, కొలెస్ట్రాల్ పెరగడం, గుండె జబ్బులు, చర్మ వ్యాధులు, జీర్ణ సంబంధ వ్యాధులు, అలసట, సోమరితనం, మానసిక అస్థిరత, ఏకాగ్రత లోపించడం, దంత సమస్యలు, కొన్ని రకాల క్యాన్సర్లు, కాలేయం/మూత్ర పిండ సమస్యలు, పోషకాహార లోపం, నిరాశ, దురలవాటుగా మారడం, మానసిక సమస్యలు లాంటి అనారోగ్యాలు కలుగుతాయి.

**భారత్‌లో జంక్ ఫుడ్ ఉప్పెన:**

అమ్మ చేతి వంట తినడం మాత్రమే తెలిసిన నాటి భారత మానవుడి నుండి నేటి డిజిటల్ నరుడి జీవనశైలిల్లో సమూల మార్పులు చోటుచేసుకున్నాయి. మహా నగరాలకు పరిమితమైన జంక్ ఫుడ్ నేడు వాడ వాడల్లో తిష్ట వేసింది. 1996లో మాక్‌డొనాల్డ్ సెంటర్ల రాకతో నేడు 400లకు పైగా శాఖలతో జంక్ ఫుడ్ కల్చర్ వేగంగా పెరగడం ప్రారంభమైంది. నేడు భారత్‌లో దాదాపు 400 వరకు కెఎఫ్‌సి సెంటర్లు నడుస్తున్నాయి, జంక్ ఫుడ్‌ను ప్రచారం చేస్తున్నాయి. నేడు బహుళజాతి సంస్థలు నెలకొల్పిన మాల్స్ ద్వారా జంక్ ఫుడ్ విరివిగా అమ్ముడు పోతున్నది, ఆరోగ్యాలను కాటు వేస్తున్నది. బర్గర్లు, పిజ్జాసు, వైట్ బ్రెడ్, వేపుడు పదార్థాలు, కుక్కీస్, పొటాటో చిప్స్, ఐస్ క్రీమ్స్, శీతల పానీయాలు, చాకొలేట్స్, ప్రాసెస్డ్ మీట్, స్ట్రీట్ ఫాస్ట్ ఫుడ్స్ లాంటి రూపాల్లో జంక్ ఫుడ్స్‌గా మార్కెట్‌లను ముంచెతున్నాయి. భారత్‌లో ప్రతి ఏట జంక్ ఫుడ్ వినియోగం 10 శాతం వరకు పెరగడంతో పాటు 93 శాతం వరకు పిల్లలు వారానికి రెండు పూటలు జంక్ ఫుడ్, 56 శాతం పిల్లలు ఐస్‌క్రిమ్స్/చాకోలేట్స్ తింటున్నారు. కౌమార యువత రోజుకు ఒక్కసారైనా ప్యాకెట్ ఫుడ్స్ తింటున్నట్లు, 40 శాతం పిల్లల లంచ్ బాక్సుల్లో ప్యాకెట్ ఫుడ్స్ ఉంటున్నాయని అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి.

అమ్మ చేతి వంట అమృత తుల్యమని, ఇంటి వంటలు ఆరోగ్య ప్రదాయినులు అని, బజారు చిరుతిండ్లు బేజారు చేస్తాయని, జంక్ ఫుడ్స్ తింటే రోగాలు దండయాత్ర చేస్తాయని గమనిస్తూ, మన ఆహారమే ఆరోగ్యానికి మూలమని తెలుసుకుంటూ, అనునిత్యం పోషకాహారం తీసుకుంటూ, సంపూర్ణ ఆయురారోగ్యాలతో జీవిద్దాం, కుటుంబంతో పాటు దేశాభివృద్ధికి తోడ్పడదాం.

# సమగ్ర ఓటర్ సవరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి కృషి చేయాలి




సమగ్ర ఓటర్ సవరణ - SIR ప్రక్రియను 100% విజయవంతం చేయాలి .ఆగస్ట్ 3 లోపు పూర్తి చేసిన కార్యకర్తలకు రాహుల్ గాంధీతో ఫోటో అవకాశం: పిసిసి ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ పరిశీలకులు చంద్రశేఖర్ రెడ్డి

కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గంలో జరుగుతున్న సమగ్ర ఓటర్ సవరణ - SIR ప్రక్రియను విజయవంతం చేయడానికి కాంగ్రెస్ పార్టీ సైనికులు కృషి చేయాలని కరీంనగర్ అసెంబ్లీ ఇంచార్జ్, పీసీసీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ రెడ్డి పిలుపునిచ్చారు. కరీంనగర్ డిసిసి కార్యాలయంలో కార్పొరేషన్ అధ్యక్షులు వైద్యులు అంజన్ కుమార్ ఆధ్వర్యంలో కార్పొరేషన్ పరిధిలోని కార్పొరేటర్లు ఎస్ ఐ ఆర్ సూపర్వైజర్లు మండల కాంగ్రెస్ అధ్యక్షులు ముఖ్య నాయకులు కార్యకర్తలతో SIR సమగ్ర ఓటర్ సవరణ పై ఏర్పాటుచేసిన సమీక్ష సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన చంద్రశేఖర్ రెడ్డి గారు మాట్లాడుతూ, రాష్ట్రవ్యాప్తంగా జరిగిన సర్వేలో కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గంలో SIR పనితీరుపై ముఖ్యమంత్రి సంతృప్తి వ్యక్తం చేశారని, దీంతో కార్యకర్తల్లో ఉత్సాహం నెలకొందని తెలిపారు. జూలై 31 నాటికి నియోజకవర్గంలో 90% SIR ప్రక్రియ పూర్తి అయ్యేలా కార్యకర్తలు శ్రమించాలని ఆదేశించారు.

ఆగస్ట్ 3 లోపు SIR ప్రక్రియను 100% శాతం పూర్తి చేసిన కార్యకర్తలకు రాహుల్ గాంధీ గారితో ఫోటో తీసుకునే అవకాశం కల్పిస్తామని ప్రకటించారు. కరీంనగర్ కార్పొరేషన్ కాంగ్రెస్ అధ్యక్షులు వైద్యుల అంజన్ కుమార్ మాట్లాడుతూ, BLO ల సమన్వయంతో ప్రతి ఓటర్‌కు SIR పై అవగాహన కల్పించాలని సూచించారు. BLA-2 లు ప్రతి ఇంటిని సందర్శించి ఒక్క ఓటు కూడా తొలగిపోకుండా చూడాలని అన్నారు.బూతు స్థాయిలో BLA-2 లు హెల్ప్ డెస్క్‌లు ఏర్పాటు చేసి, ఎన్యుమరేషన్ ఫామ్ నింపడంలో ఓటర్లకు సహాయ సహకారాలు అందించాలని కోరారు. కార్యకర్తలకు ఎలాంటి సందేహాలు ఉన్నా తనను సంప్రదించాలని ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఎస్ ఐ ఆర్ రిటర్నింగ్ ఆఫీసర్ మడుపు మోహన్, మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకుల నరసయ్య, కాంగ్రెస్ పార్టీ కార్పొరేటర్లు గంట కళ్యాణి శ్రీనివాస్, మల్లికార్జున రాజేందర్, ఆకుల నందిని ఉదయ్, కళ్ళపల్లి బాలరాజు, గుమ్మడి రాజకుమార్, ఇక్రమ్ సికిందర్, నగర మైనార్టీ సెల్ అధ్యక్షులు అహ్మద్ అలీ, ప్రధాన కార్యదర్శి కంకణాల అనిల్ కుమార్ తో పాటు డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షులు, అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని మండల కాంగ్రెస్ అధ్యక్షులు కే. రామ్ రెడ్డి, పంజాల స్వామి గౌడ్, ఎస్ ఐ ఆర్ సూపర్వైజర్లు, కార్పొరేషన్, మండల స్థాయి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## తిరుపతికి జన్మదిన శుభాకాంక్షలు



## రాజుకు జన్మదిన శుభాకాంక్షలు



## దుర్గారావుకి జన్మదిన శుభాకాంక్షలు

# వెండితెర కలల రాణి హేమ మాలిని 60 ఏళ్ల అద్భుత ప్రస్థానం

### (హేమ మాలిని 60 ఏళ్ల సినీ ప్రస్థానం పూర్తి చేసుకున్న శుభ సందర్భంగా)



ఆచార్య : మధుసూదన్ రెడ్డి బుర్ర

ప్రముఖ నటి హేమ మాలిని భారతీయ చిత్ర పరిశ్రమలో 60 సంవత్సరాలు పూర్తి చేసుకొని ఒక అసాధారణ మైలురాయిని చేరుకున్నది. హేమ మాలిని 1963లో తమిళ చిత్రం "ఇదు సత్యం"తో తన నటనా జీవితాన్ని ప్రారంభించి, 1965లో "పాండవ వనవాసం"లో ఒక చిన్న పాత్ర పోషించారు. ఈ "డ్రీమ్ గర్ల్" రాజ్ కపూర్ యొక్క 1968 క్లాసిక్ చిత్రం "సప్నో కా సౌదాగర్"తో బాలీవుడ్‌లో అడుగుపెట్టి, ఆ తర్వాత బాలీవుడ్‌లోనే అత్యంత ప్రసిద్ధి చెందిన మరియు చిరస్థాయిగా నిలిచిపోయిన ఐకాన్‌గా ఎదిగారు. మాలిని తన కెరీర్ మొత్తంలో "జానీ మారా నామ్ (1970)", "అందాజ్ (1971)", లాల్ పత్తర్ (1971), సీతా ఔర్ గీతా (1972) వంటి అనేక విజయవంతమైన చిత్రాలలో ప్రధాన పాత్రలు పోషించారు. 1970, 1980వ దశకాలలో హేమ, ధర్మేంద్రల జంట కలిసి 28 చిత్రాలలో నటించారు. షోలే, సన్యాసి, దస్ నంబారి, నసీబ్, సత్తె పిడి సత్తా, సీతా ఔర్ గీతా, అందాజ్, డ్రీమ్ గర్ల్, రజియా సుల్తానా, త్రిశూల్, దిల్లగి, ప్రతిగ్య, షరాఫత్, బర్నింగ్ ట్రైన్, దుల్హన్, స్వామి, అమీర్ గరీబ్, ప్రేమ్ నగర్, మరియు మరెన్నో కమర్షియల్ హిట్ సినిమాల్లో కొన్ని మాత్రమే. నటనకు స్వల్ప విరామం తర్వాత, హేమ తిరిగి బాగ్బన్, వీర్–జారా, లాగా చునారీ మే దాగ్, ఏక్ థీ రాణి ఐసీ భీ(2017)లో నటించింది.

**6 దశాబ్దాల వెండితెర ప్రయాణం:**

ఆమె ఆరు దశాబ్దాల వెండితెర ప్రయాణం కేవలం ఆమె తెరపై మాయాజాలం వరకే పరిమితం కాలేదు. 'షోలే'లో వాచాల, ఉత్సాహభరితమైన బసంతి పాత్ర నుండి, 2003లో వచ్చిన 'బాగ్బాన్' చిత్రంలో పూజ పాత్రతో ఆమె చేసిన అద్భుతమైన సినీ పునరాగమనం వరకు, ఆమె పాత్రలు హిందీ సినిమా చరిత్రపై చెరగని ముద్రను వేశాయి. ఆరు దశాబ్దాల పాటు సాగిన తన సుదీర్ఘ సినీ కెరీర్‌లో దాదాపు 200 చిత్రాలలో వరకు నటించారు. ఇటీవల ఆమె ముంబైలో ఒక భారీ ఛారిటీ కార్యక్రమంతో తన కెరీర్ వజ్రోత్సవాన్ని జరుపుకున్నారు. ఆమె 1992లో 'దిల్ ఆష్నా హై', 2011లో 'టెల్ మీ ఓ ఖుదా' వంటి చిత్రాలకు దర్శకత్వం వహించారు. ఆమె శాస్త్రీయ నృత్యంతో పాటు టీవీ కార్యక్రమాలపై కూడా దృష్టి సారించారు. ఆమె ధర్మేంద్ర, శశి కపూర్, దేవ్ ఆనంద్, రాజేష్ ఖన్నా, సంజీవ్ కుమార్, అమితాబ్ బచ్చన్ వంటి బాలీవుడ్ అగ్ర కథానాయకులతో తెరపై జంటగా నటించి మెప్పించారు. హిందీ చిత్రాలలో బెల్–బాటమ్ ప్యాంటు, షర్టులు ధరించిన తొలి నటి ఆమెనే. 'డ్రీమ్ గర్ల్' అని కూడా పిలువబడే హేమ, ఇప్పటికీ అప్పుడప్పుడు చిత్రాలలో నటిస్తూనే ఉన్నారు.

**బహుముఖ ప్రజ్ఞాశాలి హేమ మాలిని:**

"హేమ మాలిని ఆర్. చక్రవర్తి" 1948 అక్టోబర్ 16న మద్రాసులో ఒక తమిళ అయ్యంగార్ బ్రాహ్మణ కుటుంబంలో జన్మించారు. ఆమె తండ్రి పేరు వి.ఎస్. చక్రవర్తి, తల్లి పేరు జయలక్ష్మి చక్రవర్తి, ఆమె స్వయంగా ఒక నిర్మాత. ఆమె 11వ తరగతి వరకు చదివి, నటనారంగంలోకి ప్రవేశించారు. 1961లో ఒక ప్రాంతీయ చిత్రంలో నర్తకిగా నటించిన తర్వాత, కథానాయికగా నటించడానికి చాలా సన్నగా ఉన్నారనే కారణంతో తమిళ దర్శకుడు సి.వి. శ్రీధర్ ఆమెను తిరస్కరించారు. హేమ మాలిని ఒక ప్రముఖ నటి, బహుముఖ ప్రజ్ఞాశాలి. ఆమె నటి, దర్శకురాలు, శాస్త్రీయ నృత్యకారిణి (భరతనాట్యం, కూచిపూడి, మోహినియాట్టం), నిర్మాత, రాజకీయ నాయకురాలు. ఆమె 2014లో ఉత్తరప్రదేశ్ నుండి బీజేపీ లోక్‌సభ ఎంపీగా ఎన్నికై, 2019లో తిరిగి లోక్‌సభకు ఎన్నికయ్యారు. ఆమె 2011లో కర్ణాటక నుండి రాజ్యసభకు ఎన్నికయ్యారు. ఆమె ధర్మేంద్రతో హీరోగా అనేక చిత్రాలలో నటించారు. వివాహం కోసం ఇస్లాం మతంలోకి మారిన తర్వాత, 1979లో ఆయనను వివాహం చేసుకున్నారు. ఈ దంపతులకు ఈషా, అహానా డియోల్ అనే ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఆమె ముంబైలో 'నిత్యా విహార్ కళాకేంద్రం' అనే శాస్త్రీయ నృత్య కేంద్రాన్ని స్థాపించారు. 2000వ సంవత్సరంలో, ఆమెకు నాల్గవ అత్యున్నత పౌర పురస్కారం పద్మశ్రీతో పాటు, ఫిల్మ్‌ఫేర్ జీవిత సాఫల్య పురస్కారం, ఫిల్మ్‌ఫేర్ ఉత్తమ నటి పురస్కారం, సర్ పి.ఎస్. విశ్వవిద్యాలయం నుండి గౌరవ డాక్టరేట్ ప్రదానం చేశారు. హేమ మాలిని 11 సార్లు ఉత్తమ నటిగా ఫిల్మ్‌ఫేర్ అవార్డుకు నామినేట్ అయ్యారు. 2024లో అయోధ్య రామ మందిరంలో జరిగిన ప్రణాప్రతిష్ఠ కార్యక్రమానికి ముందు ప్రదర్శించిన ఒక నాటక ప్రదర్శనలో ఆమె సీత పాత్రను పోషించారు.

"హేమ మాలిని: ది ఆథరైజ్డ్ బయోగ్రఫీ" అనేది 2007లో సినీ పాత్రికేయురాలు మరియు రచయిత్రి భావనా ??సోమయ్యచే వ్రాయబడిన ఒక భారతీయ జీవితచరిత్ర పుస్తకం. ఇది భారతీయ నటి హేమ మాలిని జీవితం మరియు వృత్తిని వివరిస్తుంది. హేమకు నృత్యం చేయడం, డ్రైవింగ్ చేయడం మరియు యోగా చేయడం అభిరుచులు.

# యువతకు ఉద్యోగం,ఉపాధి కల్పించడంలో కేంద్ర ప్రభుత్వం విఫలం




ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బ్రాహ్మణపల్లి యుగంధర్.

జనసైన్యం సిటి

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఎన్నికల సమయంలో యువతకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో వారి ఆకాంక్షలను నెరవేర్చడంలో ఘోరంగా విఫలమైందని కేంద్ర ప్రభుత్వ యువజన వ్యతిరేకవిధానాలపై యువత ఉద్యమాలకు సిద్ధం కావాలని యుగంధర్ పిలుపునిచ్చారు.

అఖిల భారత యువజన సమాఖ్య( ఏఐవైఎఫ్) జిల్లా ఆఫీస్ బేరర్స్ సమావేశం జిల్లా అధ్యక్షులు పోలోజు రంజిత్ అధ్యక్షతన బద్దం ఎల్లారెడ్డి భవన్ లో జరిగింది. ఈ సందర్భంగా బ్రాహ్మణపల్లి యుగంధర్ మాట్లాడుతూ గత 12 సంవత్సరాలుగా యువతకు ఉపాధి ఉద్యోగం కల్పించడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని ఏటా కోటి ఉద్యోగాలు ఇస్తామని అధికారంలోకి వచ్చిన బిజెపి 12 సంవత్సరాలైనా కానీ కనీసం కోటి ఉద్యోగాలు కూడా ఇవ్వలేదని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థలను బలహీన పరుస్తూ కాంట్రాక్టు కన్నా అవుట్సోర్సింగ్ విధాలను ప్రోత్సహిస్తూ శాశ్వత ఉద్యోగ అవకాశాలను కుదిపేస్తుందని ప్రభుత్వ రంగ ఉద్యోగాల నియామకాలను పూర్తిగా తుంగలో తొక్కుతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ రంగ ప్రైవేటీకరణ నియామకలలో జాప్యం,విద్యా వైద్య రంగాల వాణిజ్య కరణ వల్ల యువత భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారుస్తుందన్నారు. ఏఐవైఎఫ్ యువజన సంఘాన్ని కరీంనగర్ జిల్లాలో గ్రామ గ్రామాన నిర్మాణం చేసి యువతను ఏఐవైఎఫ్ లో చేర్పించాలన్నారు. కేంద్రంలో, రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ కోసం కార్యకర్తలు ఉద్యమాలకు సిద్ధం కావాలన్నారు. గతంలో రాష్ట్రాన్ని పాలించిన బిఆర్ఎస్ ప్రభుత్వం యువజన సంక్షేమానికి ప్రత్యేకమైన సమగ్ర విధానం అమలు చేయలేదని బిఆర్ఎస్ పదేళ్ల పాలనలో నూతన ఉద్యోగాల కల్పన లేదని బిఆర్ఎస్ పాలనలో ఉద్యోగాల కల్పన లేకపోవడం వల్ల నిరుద్యోగం తెలంగాణ రాష్ట్రంలో పెరిగిపోయిందని కానీ యువజన సమ్మేళనం పెట్టి మేము ఉద్యోగాలు ఇచ్చామని చెప్పడం సిగ్గుచేటైన చర్య అని ఆయన విమర్శించారు.ఈరోజు ఢిల్లీ లో నీట్ ప్రశ్నాపత్రశీ లీకేజీ కారకుడు కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని యువత పార్లమెంట్ కి తరలితే వారిపై పోలీసులు భాష్ప వాయువులు ప్రయోగించి, వాటర్ క్యాన్లను ఉపయోగించి లాఠిఛార్జ్ చేయడాన్ని ఏఐవైఎఫ్ తీవ్రంగా ఖండిస్తుందన్నారు.ఈ సమావేశంలో ఏఐవైఎఫ్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కసిభోసుల సంతోష్ చారి,ఉపాధ్యక్షులు కాల్వ శ్రీనివాస్ యాదవ్, కోశాధికారి పినమల్ల ఉదయ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# కరీంనగర్ జిల్లా ప్రజలకు శుభవార్త






బ్యాడ్మింటన్ . టేబుల్ టెన్నిస్ .చెస్ .క్యారం బోర్డు రంగంలో ఆసక్తిగలవారికి గంటకు 300 రూపాయల చొప్పున కోర్టును, బ్యాడ్మింటన్, టేబుల్ టెన్నిస్ .చెస్ .క్యారం బోర్డు ఆటకు ఇవ్వబడును. ముందస్తు బుకింగ్ చేసుకున్న వారికి ఇవ్వబడును బుకింగ్ చేసుకోవాల్సిన

**ఫోన్ నెంబర్**

**9246966660**

## ఆట వేళలు

ఉదయం 5 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు






మన కరీంనగర్ జిల్లా కేంద్రంలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఇండోర్ స్టేడియంలో క్రీడాకారుల కోసం ప్రత్యేకంగా బ్యాడ్మింటన్. టేబుల్ టెన్నిస్ .క్యారం బోర్డు. చెస్. వంటి క్రీడలను ఇప్పుడు మన డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఇండోర్ స్టేడియంలో శిక్షణ ఇవ్వబడును. నిపుణులైన కోచులచే బ్యాడ్మింటన్. టేబుల్ టెన్నిస్ .చెస్ .క్యారం బోర్డు వంటి క్రీడలలో శిక్షణ ఇవ్వబడును.కరీంనగర్ జిల్లా లోని విద్యార్థినీ విద్యార్థులను మంచి క్రీడాకారులుగా తీర్చిదిద్దేందుకు నిపుణులైన కోచునులచే శిక్షణ ఇవ్వబడును.

ఆట వేళలు

ఉదయం 5 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు

ఇండోర్ స్టేడియం క్రీడాకారుల కోసం తెరిచి ఉంచబడును. కావున ఆసక్తిగల క్రీడాకారులు విద్యార్థిని విద్యార్థులు శిక్షణ కోసం మరియు ఆట ఆడుకునే అందుకోసం సంప్రదించవలసిన ఫోన్ నెంబర్.9246966660









జనచిత్రం



కృష్ణ గౌడ్‌కు జన్మదిన శుభాకాంక్షలు



సాగర్‌కు జన్మదిన శుభాకాంక్షలు

## దుబాయ్ ఈటిసిఏ ఆధ్వర్యంలో ఘనంగా శ్రీ మహంకాళి అమ్మవారి బోనాల మహోత్సవం




**జనసైన్యం సిటి**

యూఏఈలోని రాస్ అల్ ఖైమా మైత్రి ఫార్మ్స్‌లో ఎమిరేట్స్ తెలంగాణ కల్చరల్ అండ్ వెల్ఫేర్ అసోసియేషన్ (ETCA) ఆధ్వర్యంలో శ్రీ మహంకాళి అమ్మవారి బోనాల మహోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు.యూఏఈలోని వివిధ ఎమిరేట్స్‌ల నుంచి సుమారు 400 మంది తెలంగాణ ప్రవాసులు కుటుంబ సమేతంగా హాజరై భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు. జుజూా ఆధ్వర్యంలో వరుసగా నాలుగోసారి నిర్వహించిన ఈ వేడుకలో గౌరమ్మ పూజ, బోనాల సమర్పణ, కుంకుమార్చన, మహాహారతి, దీపోత్సవం ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.పట్టు చీరలు ధరించిన మహిళలు తలపై బోనాలు మోసుకుంటూ నిర్వహించిన ఊరేగింపు, ఒగ్గు డోలు మోతలు, పోతురాజుల విన్యాసాలు తెలంగాణ సంస్కృతిని విదేశీ నేలపై ఆవిష్కరించాయి.కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మైత్రి గ్రూప్ వ్యవస్థాపకులు కొత్త జైపాల్ రెడ్డి మాట్లాడుతూ, విదేశాల్లో తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు పరిచయం చేస్తున్న జుజూా సభ్యులను అభినందించారు.జుజూా వ్యవస్థాపక అధ్యక్షుడు కిరణ్ కుమార్ పీచర, అధ్యక్షుడు జగదీష్ రావు మాట్లాడుతూ, విదేశాల్లో జన్మించిన భావితరాలకు తెలంగాణ పండుగల గొప్పతనాన్ని పరిచయం చేయడమే సంస్థ ప్రధాన లక్ష్యమని తెలిపారు.అనంతరం భక్తులందరికీ మహాప్రసాదం పంపిణీ చేసి, తెలంగాణ సంప్రదాయ వంటకాలతో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. విదేశాల్లో ఉన్నామనే భావన కలగకుండా స్వగ్రామంలో బోనాలు జరుపుకున్న అనుభూతి కలిగిందని తెలంగాణ ప్రవాసులు నిర్వాహకులను అభినందించారు.ఈ కార్యక్రమంలో ETCA వ్యవస్థాపక అధ్యక్షుడు కిరణ్ కుమార్ పీచర, అధ్యక్షుడు జగదీష్ రావు చీటీ, ఉపాధ్యక్షులు శ్రీనివాస్ ఎలిగేటి, ప్రధాన కార్యదర్శి రాణి కొట్ల, సంయుక్త కార్యదర్శి శేఖర్ గౌడ్ గుండవేని, కోశాధికారి తిరుమల్ రావు బీరెల్లి, మాజీ అధ్యక్షులు రాధారపు సత్యం, సీనియర్ సభ్యులు వెంకటేశ్వర్ రావు, ఎస్.పీ. కస్తూరి, సురేష్ రెడ్డి, కార్యవర్గ సభ్యులు వినోద్ ఆచారి, రఘు ఎలిగేటి, రాము కందుకూరి, సామ శ్రీనివాస్ రెడ్డి, రాజేష్ పోలంపల్లి, కిరణ్ చెట్టిగారి, సారిక పీచర, మమత కస్తూరి, అన్నపూర్ణ, మౌనిక గౌడ్, మధు కుమార్, వనజ గోగుల, రనీషా, విపుల, స్వప్న, దీపిక తదితరులు, మహిళా విభాగ సభ్యులు, వాలంటీర్లు మరియు యూఏఈ నలుమూలల నుంచి వచ్చిన తెలంగాణ ప్రవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పిఎమ్‌సిహెచ్ బాలుర, బాలికల వసతి గృహాలు ఏర్పాటు చేయాలి



**జనసైన్యం సిటి**

సోమవారం రోజున కరీంనగర్ జిల్లా ప్రజావాణి లో భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (DYFI) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో గిరిజన విద్యార్థుల అవసరాలకు అనుగుణంగా జిల్లాలో అదనంగా ఒక బాలుర, ఒక బాలికల PMCH వసతి గృహాలను ఏర్పాటు చేయాలని కోరుతూ జిల్లా కలెక్టర్ గారికి వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా డీవైఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి నరేష్ పటేల్ మాట్లాడుతూ, కరీంనగర్ జిల్లాలో గిరిజన విద్యార్థుల సంఖ్య ప్రతి సంవత్సరం పెరుగుతున్నప్పటికీ వారికి అవసరమైన స్థాయిలో వసతి గృహాలు లేకపోవడం వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని అన్నారు.జిల్లాలో ఎస్సీ, బీసీ విద్యార్థుల కోసం 6 నుండి 7 వరకు ప్రభుత్వ వసతి గృహాలు అందుబాటులో ఉండగా, గిరిజన (ఎస్టీ) విద్యార్థుల కోసం మాత్రం కేవలం ఒక బాలుర, ఒక బాలికల ౹ావీజ౹ వసతి గృహం మాత్రమే ఉండడం విచారకరమన్నారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా హాస్టళ్ల సంఖ్యను పెంచడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు.

ప్రస్తుతం ఉన్న రెండు౹ావీజ౹ వసతి గృహాల్లో కలిపి సుమారు 600 మంది విద్యార్థులు మాత్రమే నివాసం ఉంటున్నారని, సీట్లు పూర్తిగా నిండిపోవడంతో వెయ్యికి పైగా గిరిజన విద్యార్థులు ప్రైవేట్ హాస్టళ్లను ఆశ్రయించాల్సి వస్తోందన్నారు. దీంతో పేద గిరిజన కుటుంబాలపై తీవ్ర ఆర్థిక భారం పడుతోందని, చాలామంది విద్యార్థులు హాస్టల్ సౌకర్యం లేక చదువును మధ్యలోనే నిలిపివేయాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు.ప్రస్తుతం నడుస్తున్న గిరిజన ౹ావీజ౹ వసతి గృహాలు అద్దె (ప్రైవేట్) భవనాల్లో కొనసాగుతున్నాయని, దీంతో విద్యార్థులకు సరిపడా గదులు, అధ్యయన వాతావరణం, ఆట స్థలం, భద్రతతో కూడిన వసతి సౌకర్యాలు అందడం లేదని తెలిపారు. ప్రభుత్వానికి చెందిన శాశ్వత భవనాలు లేకపోవడం వల్ల ప్రతి సంవత్సరం విద్యార్థులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు.

బాలుర, బాలికల వసతి గృహాలకు శాశ్వత ప్రభుత్వ భవనాలను నిర్మించాలని, అలాగే ప్రస్తుతం అద్దె భవనాల్లో కొనసాగుతున్న హాస్టళ్లకు కూడా సొంత భవనాలు మంజూరు చేసి అన్ని మౌలిక సదుపాయాలతో అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు.ప్రస్తుతం ఉన్న వసతి గృహాల్లో మౌలిక వసతులను మెరుగుపరచాలని కోరారు.జిల్లా కలెక్టర్ ఈ సమస్యను రాష్ట్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి అదనంగా PMCH బాలుర, బాలికల వసతి గృహాలను మంజూరు చేయడంతో పాటు శాశ్వత భవనాల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించకపోతే గిరిజన విద్యార్థులతో కలిసి డీవైఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో దశలవారీ ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు శివ కుమార్,నాయకులు, అరవింద్,వంశీ,గిరిజన విద్యార్థులు వాసుదేవ్,శ్రీకాంత్,శ్రీనాథ్,దేవేందర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## నాణ్యత ప్రమాణాలు పాటించని హోటళ్ళను, రెస్టారెంట్లను సీజ్ చేయాలి

**జనసైన్యం సిటి**



హోటల్స్, రెస్టారెంట్ నిర్వాహకులు నాణ్యత ప్రమాణాలు పాటించని నిర్వాహకులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పడాల రవీందర్ సంబంధిత అధికారులను కోరారు. ఈ రోజు కరీంనగర్ పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యానికి అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలనన్నారు. ఆహార విక్రయ కేంద్రాల నిర్వాహకులు తప్పనిసరిగా పరిశుభ్రత, నాణ్యతతోపాటు పారిశుధ్య ప్రమాణాలను పాటించాలని అన్నారు.ఆహారం నిల్వచేసె విధానం, వంటశాలల శుభ్రత, వినియోగించే ముడి పదార్థాల నాణ్యతపై జిల్లా కలెక్టర్ మరియు సంబంధిత అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కోరారు. జిల్లాలోని హోటళ్లు, రెస్టారెంట్లు, బేకరీలు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు, దాబాల్లో అపరిశుభ్రత నెలకొంటుంది. రోజుల తరబడి నిల్వ చేసిన ఆహార పదార్థాలతో వంటకాలు తయారు చేస్తు న్నారు. కుళ్లిన కూరగాయలు, మాంసం, నాణ్యత లేని పదార్థాలు, కాలం చెల్లిన మసాలాలు వినియోగిస్తున్నారు. హోటళ్లు నిర్వాహకులు నిబంధనలు పాటించకపోవడంతో ఆహార నాణ్యత ప్రశ్నార్ధకంగా మారుతోంది. ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు హోటళ్లను నామమాత్రంగా తనిఖీలు చేస్తుండడంతో హోటళ్ల నిర్వాహకులు ఇష్టారీతిన వ్యవహరిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయని ఆయన అన్నారు.నాణ్యమైన వస్తువులు వినియోగించకుండ ఆహార పదార్థాలు తయారు చేసి విక్రయించడం ప్రజల ప్రాణాలతో చెలగాటమాడటమేనన్నారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై జరిమానాలు విధించడంతోపాటు అవసరమైన లైసెన్సు లను కూడా రద్దు చేయాలని పడాల రవీందర్ డిమాండ్ చేశారు.



ముజీద్ మహ్మద్‌కు జన్మదిన శుభాకాంక్షలు



సత్యంకు జన్మదిన శుభాకాంక్షలు



సీనుకు జన్మదిన శుభాకాంక్షలు

# స్వర్గం - నరకం: మనసు ఎంచుకునే జీవితం



డాక్టర్.
కోలాహలం రామ్ కిశోర్

మరణం తర్వాత స్వర్గం ఉందా? నరకం ఉందా? అనే ప్రశ్న వేల సంవత్సరాలుగా మానవుణ్ని వెంటాడుతోంది. మతాలు, తత్వాలు, సంప్రదాయాలు ఈ ప్రశ్నకు తమదైన సమాధానాలు చెప్పాయి. కానీ ఒక ప్రశ్న మాత్రం మనం చాలా అరుదుగానే వేసుకుంటాం.

మనం వెతుకుతున్న స్వర్గం నిజంగా మరణం తర్వాత దొరికేదేనా? లేక మనం బ్రతుకుతున్న జీవితంలోనే దానిని గుర్తించలేకపోతున్నామా? అదే విధంగా నరకం కూడా ఎక్కడో భూగర్భంలో ఉన్న శిక్షా స్థలమా, లేక మన ఆలోచనలతో, మన అసంతృప్తితో మనమే ప్రతిరోజూ నిర్మించుకునే మానసిక స్థితినా?

మనిషి చరిత్రను ఒక్కసారి వెనక్కి తిరిగి చూస్తే ఒక గొప్ప నిజం అర్థమవుతుంది. నేటి సాధారణ మనిషి అనుభవిస్తున్న సౌకర్యాల్లో చాలా వరకు గతంలో మహారాజులకు కూడా లేవు. ఒక స్విచ్ నొక్కగానే వెలుగు రావడం, మరో బటన్ నొక్కగానే చల్లని గాలి వీచడం, కుళాయి తిప్పగానే తాగునీరు రావడం, కొన్ని నిమిషాల్లో ఆహారం సిద్ధం కావడం, ప్రపంచం మరో మూలలో ఉన్న మనిషితో క్షణాల్లో మాట్లాడగలగడం, వేల పుస్తకాల జ్ఞానం ఒక చిన్న మొబైల్‌లో దొరకడం---ఇవన్నీ కొన్ని తరాల క్రితం అద్భుతాలే. నేడు ఇవి మనకు అంత సాధారణంగా అనిపిస్తున్నాయి కాబట్టి వాటి విలువనే మర్చిపోయాం.

సమస్య సౌకర్యాల కొరతలో లేదు. వాటికి అలవాటు పడిపోయిన మనసులో ఉంది. మనోవిజ్ఞాన శాస్త్రవేత్తలు దీనిని "హెడానిక్ అడాప్టేషన్" అని పిలుస్తారు. అంటే ఏ కొత్త సుఖమైనా కొంతకాలానికే సాధారణమైపోతుంది. కొత్త ఇల్లు కొన్నప్పుడు కలిగిన ఆనందం కొన్ని నెలలకే తగ్గిపోతుంది. కొత్త కారు కొన్న సంతోషం కొద్ది రోజుల్లో మామూలైపోతుంది. కొత్త ఫోన్ తెచ్చుకున్న ఉత్సాహం మరో కొత్త మోడల్ మార్కెట్‌లోకి వచ్చిన వెంటనే ఆవిరైపోతుంది. మనిషి తనకు దొరికిన ఆనందాన్ని ఆస్వాదించకుండా, ఇంకా దొరకనిదానికే మనసును బంధిస్తాడు. అక్కడే అసంతృప్తి పుడుతుంది. అదే నరకానికి తొలి మెట్టు.సంతోషం అనేది వస్తువుల సంఖ్యతో పెరగదు. పోలికల సంఖ్యతో తగ్గిపోతుంది. మన ఇల్లు మనకు చాలనిపిస్తుంది. కానీ పక్కింటి ఇల్లు పెద్దదిగా కనిపించిన క్షణం మన ఆనందం కరిగిపోతుంది. మన ఆదాయం సరిపోతుంది. కానీ ఇంకొకరి సంపాదన ఎక్కువగా కనిపించినప్పుడు మనకు లోటు మొదలవుతుంది. సోషల్ మీడియా కాలంలో ఈ పోలికల వ్యాధి మరింత పెరిగింది. ప్రతి ఒక్కరూ తమ జీవితంలోని అందమైన క్షణాలనే ప్రపంచానికి చూపిస్తున్నారు. వాటిని చూసే మనిషి తన సాధారణ జీవితాన్ని వైఫల్యంగా భావించడం మొదలుపెడుతున్నాడు. వాస్తవానికి అతను పోల్చుకుంటున్నది నిజజీవితాన్ని కాదు; ఎంపిక చేసి చూపించిన చిత్రాలనే.

అదే సమయంలో ఈ భూమిపైన మరో ప్రపంచం కూడా ఉంది. ఈ రోజుకీ కోట్లాది




మంది పరిశుభ్రమైన తాగునీటి కోసం కిలోమీటర్లు నడుస్తున్నారు. చాలామందికి పక్కా ఇల్లు లేదు. లక్షలాది పిల్లలు చదువు కంటే ఉపాధిని ఎంచుకోవాల్సిన పరిస్థితిలో ఉన్నారు. ఆకలి, అనారోగ్యం, నిరాశ్రయత్వం ఇంకా ప్రపంచంలో కోట్లాది కుటుంబాల వాస్తవం. మనం సాధారణంగా తీసుకునే ప్రతి చిన్న సౌకర్యం మరొకరి జీవితకాల కల కావచ్చు. ఈ వాస్తవం గుర్తొచ్చినప్పుడు కృతజ్ఞత అనే భావన సహజంగానే పుడుతుంది.

అయితే కృతజ్ఞత అంటే సమస్యలను చూడకపోవడం కాదు. జీవితంలో అన్యాయం లేదని చెప్పడం కాదు. సమాజంలో పేదరికం, అసమానతలు, వివక్ష, బాధలు లేవని కళ్లు మూసుకోవడం కూడా కాదు. నిజమైన కృతజ్ఞత అంటే మనకు ఉన్న వరాలను గుర్తించడంతో పాటు, వాటి విలువ తెలిసిన మనిషిగా ఇతరుల జీవితాలను కూడా మెరుగుపరచడానికి ప్రయత్నించడం. తనకు లభించిన అవకాశాలను సమాజంతో పంచుకోవడం. ఎందుకంటే మన వ్యక్తిగత స్వర్గం, చుట్టూ ఉన్నవారి నరకం మీద నిర్మించబడితే అది సంపూర్ణ ఆనందం కాదు.

తత్వశాస్త్రంలో ఒక అందమైన భావన ఉంది. మనిషిని బాధపెట్టేది సంఘటన కాదు; ఆ సంఘటనను అతను అర్థం చేసుకునే విధానం. ఒకే వర్షాన్ని రైతు ఆశీర్వాదంగా చూస్తాడు. పెళ్లి నిర్వాహకుడు ఇబ్బందిగా చూస్తాడు. సంఘటన ఒకటే. అనుభవం మాత్రం భిన్నం. అంటే మన జీవిత నాణ్యతలో పెద్ద భాగాన్ని పరిస్థితులు కాకుండా మన దృక్పథమే నిర్ణయిస్తుంది. అందుకే కొందరు కష్టాల్లో కూడా ప్రశాంతంగా జీవిస్తారు. మరికొందరు అన్ని సౌకర్యాల మధ్య కూడా అసంతృప్తితో కాలం గడుపుతారు.

ప్రతి రోజు ముగిసే ముందు మనం కోల్పోయిన వాటి జాబితా కాకుండా, లభించిన వరాల జాబితా రాస్తే మన ఆలోచనలో గొప్ప మార్పు వస్తుంది. ఈరోజు నేను ఆరోగ్యంగా ఉన్నానా? నాకు తినడానికి ఆహారం ఉందా? తాగడానికి నీరు ఉందా? ప్రేమించే కుటుంబం ఉందా? నేర్చుకునే అవకాశం ఉందా? ఇంకో రోజు జీవించే అవకాశం లభించిందా? ఈ ప్రశ్నలకు నిజాయితీగా సమాధానం చెప్పగలిగితే మనం ఇప్పటికే ఎంతో సంపన్నులమని అర్థమవుతుంది. కృతజ్ఞత అనేది సమస్యలను తొలగించదు; కానీ సమస్యల బరువును తగ్గించే అంతర్గత బలాన్ని ఇస్తుంది.

మానవ జీవితం సంపూర్ణం కాదు. సుఖం, దుఃఖం, విజయం, వైఫల్యం, ఆశ, నిరాశ ఇవన్నీ కలిసే జీవితం. కానీ వాటిలో దేనికి ఎక్కువ స్థానం ఇవ్వాలో నిర్ణయించేది మనమే.

ఫిర్యాదులను లెక్కించే మనసు ఎప్పటికీ నరకంలోనే ఉంటుంది. అవకాశాలను, అనుబంధాలను, చిన్న చిన్న ఆనందాలను గుర్తించే మనసు ఎక్కడ ఉన్నా స్వర్గాన్నే సృష్టిస్తుంది. స్వర్గం అనేది భౌగోళిక స్థలం కాదు; మనసు పొందే ప్రశాంతత. నరకం అనేది శిక్షల ప్రపంచం కాదు; అంతులేని అసంతృప్తి.

చివరికి మనిషి జీవితంలో అత్యంత విలువైన ప్రశ్న ఇదొక్కటే... "నాకు ఇంకా ఏమి కావాలి?" కంటే, "ఇప్పటికే నాకు ఎంత లభించింది?" అని ఎన్ని సార్లు ఆలోచించాను? అనే ప్రశ్న. ఆ క్షణం నుంచే జీవితం మారుతుంది. ఎందుకంటే తృప్తి అనేది బయట దొరికే బహుమతి కాదు; లోపల పెంచుకునే సంస్కారం. కృతజ్ఞత అనేది సంపద తర్వాత వచ్చే గుణం కాదు.  అదే నిజమైన సంపద. ఆ సంపదను సంపాదించిన మనిషికి ప్రతి ఉదయం ఒక కొత్త వరం, ప్రతి శ్వాస ఒక పండుగ, ప్రతి రోజు ఒక స్వర్గానుభూతి అవుతుంది.

# హైటెక్ వేగం ఆత్మీయతీరం



సమిష్టి కుటుంబాలకు
దూరంగా వ్యక్తిగత
కుటుంబాలకు దగ్గరగా
స్వేచ్ఛగా స్వతంత్రంగా
బతుకుతూ మనిషి
షేరింగ్ కేరింగుకు దూరంగా
ఒంటరి జీవితాన్ని
గడుపుతున్నాడు
మనిషి కాలం చేతిలో
కీలుబొమ్మైపోయాడు
ధనం మూలం జగత్
అన్న సూక్తిని స్ఫూర్తిగా
తీసుకొని ధనమేరా
అన్నింటికి మూలం
ఆధనం విలువ
తెలుసుకోవడమే
మానవ ధర్మం అయింది
నేటి మానవుడు
ఉరుకుల పరుగుల
యుగంలో పడిపోయాడు
రెప్పపాటులో లోకం
మారిపోతుంది
హైటెక్ వేగం బంధాలను
మింగేస్తుంది
స్కీన్ల వెనుక దాక్కున్నాయి చూపులు
నిశ్శబ్దంగా మారాయి
గదిలోన మాటలు
సాఫ్ట్వేర్ కొలువుల
బిజీ జీవితాలు
పక్కనున్న మనిషిని
చూసే తీరికలేదు
మాట్లాడే ఓపికలేదు
కల్మషం లేని నవ్వుల
సందడి ఎక్కడా లేదు
కలిసిన నవ్వే
కమ్మని క్షణమే రాదు

కాసేపు యాంత్రిక
లోకాన్ని ఆపుదాం
ఆన్లైన్ బంధాల
ముసుగును తీసేద్దాం
అందరం ఒకే చోట
కూర్చుందాం
మనసు విప్పి ఆత్మీయంగా
మాట్లాడుకుందాం
పాత జ్ఞాపకాలను మళ్ళీ
నెమరు వేసుకుందాం
ప్రేమానురాగాల తీపిని పంచుదాం
హైటెక్ కాలంలో
స్నేహాన్ని గెలిపిద్దాం
మనుసుల గడపలు
దాటి కలుసుకుందాం.
మాటల మల్లెలు
ఇక్కడ పూయిద్దాం
సమత మమత
మానవీయతతో
మానవాళి మనుగడకు పాటుపడుదాం
ఆత్మీయత పరిమళాలు
అందరికీ పంచుదాం
ఈ బిజీ కాలంలోనూ
కాసేపు ఆగుదాం
మనిషికి మనిషి తోడని చాటుదాం.
సాంకేతిక త సౌకర్యాన్ని
ఇస్తుంది కానీ సంతోషాన్ని
ఇవ్వదు డిజిటల్ లైక్స్ కన్నా
ఆత్మీయ పలకరింపే మిన్న
పరుగుల లోకాన్ని కాసేపు
పక్కన పెడదాం
మనిషిని ప్రేమిస్తూ
మానవత్వాన్ని గెలిపిద్దాం

నేదునూరి కనకయ్య

# ట్రైనీ ఐపీఎస్ అధికారి ఆత్మహత్యాయత్నం!



**జనసైన్యం సిటి**

జాతీయ పోలీస్ అకాడమీలో లైంగిక వేధింపుల కేసులో ఒక ట్రైనీ ఐపీఎస్ అధికారి ఆత్మహత్య కు యత్నించడం పోలీసు వర్గాల్లో తీవ్ర కలకలం రేపింది. తోటి మహిళా అధికారి ఇచ్చిన లైంగిక వేధింపుల ఫిర్యాదుతో కేసు నమోదు కావడం, ఆపై తీవ్ర డిప్రెషన్‌కు లోనవడమే ఈ ఘటనకు కారణమని తెలుస్తోంది. ట్రైనీ ఐపీఎస్ అధికారి ఉదయ్ కృష్ణారెడ్డి, ఎర్రగడ్డ మోతీనగర్‌లోని తన సోదరుడి నివాసంలో ఈరోజు ఉదయం శానిటైజర్ తాగి ఆత్మహత్యకు ప్రయత్నించాడు దీనిని గమనించిన కుటుంబ సభ్యులు తక్షణమే స్పందించి, ఆయనను చికిత్స నిమిత్తం ఎస్సార్ నగర్ పరిధిలోని ఒక ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. ఈ దారుణ నిర్ణయా నికి వెనుక ఉన్న కారణాలను పరిశీలి స్తే.. నిన్ననే ఉదయ్ కృష్ణారెడ్డిపై ఒక సహచర మహిళా ట్రైనీ ఐపీఎస్ అధికారి లైంగిక వేధిం పుల ఆరోపణలు చేస్తూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు అత్తాపూర్ పోలీసు లు కృష్ణారెడ్డిపై అధికారికంగా కేసు నమోదు చేశారు. ఉన్నతమైన పోలీస్ ఉద్యోగంలో ఉంటూ ఇలాంటి తీవ్రమైన కేసు నమోదు కావడంతో ఉదయ్ కృష్ణారెడ్డి తీవ్ర మన స్తాపానికి, డిప్రెషన్‌కు గురయ్యారు. అదే మానసిక ఆందోళన లో సోదరుడి ఇంటికి వెళ్లిన ఆయన ఈ అఘాయిత్యానికి ఒడిగట్టినట్లు ప్రాథ మిక సమాచారం. ఘటనపై సమాచారం అందుకున్న స్థానిక పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు.

# హైదరాబాద్ లో ముగ్గురు బాలికల అదృశ్యం

**జనసైన్యం సిటి**

హైదరాబాద్‌లో ముగ్గురు మైనర్ బాలికలు ఒకేసారి అదృశ్యం కావడం నగరంలో కలకలం రేపుతోంది. దోమల గూడ ప్రాంతానికి చెందిన ముగ్గురు బాలికలు ఇంట్లో చెప్పకుండా వెళ్లిపోవడంతో వారి కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు సీసీటీవీ ఫుటేజీల ఆధారంగా దర్యాప్తు కొనసాగిస్తు న్నారు.పోలీసుల వివరాల ప్రకారం.. ఛత్తీస్‌గఢ్‌కు చెందిన వలస కార్మిక కుటుం బాలు దోమలగూడ లోని ఫరీద్ బస్తీలో నివాసం ఉంటున్నాయి. అదే ప్రాంతానికి చెందిన సహిత కుమారి, స్నేహ కుమారి, లత అనే ముగ్గురు మైనర్ బాలికలు ఆదివారం మధ్యాహ్నం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. ఎంత వెతికినా ఆచూకీ లభించకపో వడంతో వారి తల్లి దండ్రులు దోమల గూడ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు.ఫిర్యాదు అందుకున్న పోలీసులు వెంటనే ప్రత్యేక బృందాలను రంగంలోకి దింపి బాలికలు వెళ్లిన మార్గాల్లోని సీసీటీవీ కెమెరాలను పరిశీ లించారు. విచారణ లో బాలికలు మొదట హిమాయత్ నగర్‌లో ఓ ఆటో ఎక్కిట్లు గుర్తించారు. ఆ తర్వాత వారు కాచిగూడ రైల్వే స్టేషన్‌కు చేరుకున్న ట్లు సీసీటీవీ ఫుటేజీ లో నమోదైంది. దర్యాప్తులో మరో కీలక విషయం వెలుగులోకి వచ్చిం ది. కాచిగూడ రైల్వే స్టేషన్ నుంచి బాలిక లు సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌కు వెళ్లినట్లు పోలీసులు గుర్తించారు. ప్రస్తుతం రెండు రైల్వే స్టేషన్ల లోని సీసీటీవీ ఫుటేజీ లను క్షుణ్ణంగా పరిశీ లిస్తూ వారి కదలికల ను ట్రాక్ చేస్తున్నారు.బాలికలు తమ స్వగ్రామమైన ఛత్తీస్ గఢ్‌కు వెళ్లి ఉండొచ్చ నే అనుమానంతో పోలీసులు ఆ దిశగా కూడా విచారణ చేపట్టారు. రైల్వే అధికారులు, ఇతర జిల్లాల పోలీసులతో సమన్వయం చేసుకుంటూ ప్రత్యేక బృందాలు గాలింపు చర్యలను ముమ్మరం చేశాయి. మరోవైపు ముగ్గురు బాలికల ఆచూకీ ఇప్పటికీ లభించకపోవడంతో వారి తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళనలో ఉన్నారు. బాలికలను వీలైనంత త్వరగా గుర్తించి సురక్షితంగా కుటుంబ సభ్యులకు అప్పగించేందుకు పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు కొనసాగిస్తున్నారు.





# మధ్యాహ్న భోజన కార్మికుల కు కనీస వేతనంకై పోరాడుదాం



**జనసైన్యం సిటి**

జిల్లాలోని ప్రభుత్వ స్కూళ్లలో చదువుతున్న విద్యార్థులకు భోజనం పెట్టే పథకం అయినటువంటి మధ్యాహ్న భోజనం పథకం కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఈరోజు జిల్లా విద్యాశాఖ అధికారికి వినతి పత్రం ఇవ్వడం జరిగింది . ఈ సందర్భంగా మధ్యాహ్న భోజనం పథకం వర్కర్ ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కె రజిత మాట్లాడుతూ రాష్ట్రంలో దాదాపు 50 వేల మంది కార్మికులు పనులు చేయుచున్నారని వీరికి ప్రస్తుతం కేవలం నెలకు 3000 మాత్రమే జీతం చెల్లిస్తున్నారని, వారంలో మూడు రోజులు విద్యార్థులకు కోడిగుడ్డు ఇవ్వాలని నిబంధన ఉండగా ప్రస్తుతం ప్రభుత్వం గుడ్డుకు ఆరు రూపాయలే చెల్లిస్తున్నారని కానీ మార్కెట్లో గుడ్డు ధర ఎనిమిది రూపాయలు ఉన్నదని ఇలాంటి పరిస్థితుల్లో కార్మికులు తమ జీవితంలో నుంచి వెచ్చించి విద్యార్థులకు భోజనం అందిస్తున్న రాష్ట్ర ప్రభుత్వానికి కనీస సోయి లేకుండా కార్మికుల జీతాల పెంపుదల గాని, వంటకు సరిపడా వస్తువుల సరఫరాకు గాని, ముందుకు రాకపోవడం సిగ్గుచేటు అని వారు విమర్శించారు. ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు కటికరెడ్డి బుచ్చన్న యాదవ్ మాట్లాడుతూ ఒకవైపు రాష్ట్ర ముఖ్యమంత్రి విద్యార్థులకు అల్పాహారం కూడా అందిస్తామని, మధ్యాహ్న భోజనం ప్రభుత్వ కాలేజీల్లో కూడా అమలు చేస్తామని గొప్పలు చెప్పుకుంటున్నప్పటికీ ఆచరణ సాధ్యం కావడం లేదని వారు విమర్శించారు. మధ్యాహ్న భోజనం పథకంలో పనిచేయుచున్న కార్మికులకు కనీస వేతనం పదివేలు ఇస్తామని ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టి నేటికీ కూడా అమలు చేయడం లేదని వారు పేర్కొన్నారు. కేంద్ర కార్మిక సంఘాలుగా కార్మికులకు కనీస వేతనం 26,000 ఇవ్వాలని అన్ని కేంద్ర కార్మిక సంఘాలు డిమాండ్ చేస్తున్నాయని కానీ ఈ కార్మికుల జీతాలు ఏ మూలకు సరిపోకుండా కేవలం 3000 జీతం చెల్లిస్తూ అందులో గుడ్డు ధర అధికంగా ఉండడం కూరగాయల ధరలు అధికంగా ఉండడం గ్యాస్ సిలిండర్ సరఫరా చేయకపోవడం వలన కార్మికులు అనేక ఇబ్బందుల్ని ఎదుర్కొంటున్నారని వారు విమర్శించారు. ఈ వినతి పత్రం కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా నాయకులు మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు బొజ్జ సాయిలు ఏఐటీయూసీ నాయకులు అల్లపు రాజు, హల్య తదితరులు పాల్గొన్నారు

# కేంద్రంలో బీజేపీ నియంతృత్వ పాలన కొనసాగుతుంది.

**జనసైన్యం సిటి**



కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం నియంతృత్వ పాలన కొనసాగిస్తూ,దేశ రాజధాని ఢిల్లీలో నీట్ పేపర్ లీకేజీపై తీవ్ర ఆందోళన జరుగుతుంటే ప్రధాని మోడీ ఒక నియంతలా వ్యవహరిస్తూ కళ్ళుండి చూడలేని కాబోధిలా దుర్మార్గంగా పరిపాలిస్తున్నాడని సిపిఐ సీనియర్ నాయకులు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి ఆరోపించారు. సోమవారం కరీంనగర్ లోని బద్దం ఎల్లారెడ్డి భవన్ లో సిపిఐ జిల్లా కార్యవర్గ సమావేశం కార్యవర్గ సభ్యులు పిట్టల సమ్మయ్య అధ్యక్షతన జరిగింది. సమావేశమునకు ముఖ్య అతిథిగా హాజరైన చాడ వెంకటరెడ్డి మాట్లాడుతూ ఆర్ఎస్ఎస్ కనుసన్నల్లో దేశాన్ని పరిపాలిస్తున్న నరేంద్ర మోడీ పూర్తిగా ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడుతూ పరిపాలన కొనసాగిస్తున్నాడని, కార్పొరేట్ పెట్టుబడిదారులకు అనుకూలంగా వ్యవహరిస్తూ వారి సంక్షేమానికి కొమ్ముకాస్తున్నాడని, విచ్చలవిడిగా దేశ సంపదను,వనరులను కొల్లగొడుతున్నాడని,పేదల సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించడం వారిని ఆర్థిక సంక్షోభంలోకి నెట్టివేసే విధంగా బీజేపీ ప్రభుత్వం అధికారం చెలాయిస్తుందని,అత్యంత అవినీతి పరులకు,అక్రమార్కులకు అండగా నిలవడమే కాకుండా వారిని బీజేపీ అక్కున చేర్చుకోవడం హేయమైన చర్య అని అన్నారు. పన్నెండేళ్ళ పరిపాలనలో ప్రజలకు ఒరిగిందేమీ లేదని,నల్ల డబ్బు తేలేదని,2కోట్ల ఉద్యగాల మాటలు నీటిమూటలయ్యాయని, పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్,నిత్యవసర వస్తువుల ధరలు పెంచుతూ సామాన్య ప్రజలపై భారం వేస్తుందని,వికసిత్ భారత్ పేరుతో ప్రజల దృష్టిని మారుస్తుందని,గ్రామీణ ప్రజల బ్రతుకులకు వరప్రసాదం లాంటి గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని నీరుగార్చి గార్చేందుకే మహాత్మా గాంధీ పేరు తొలగించిందని,రాష్ట్రాలపై భారం వేసిందని ఇలా అనేక విధాలుగా ఇబ్బందులకు గురిచేస్తున్న బీజేపీ విధానాలను ఎండగట్టేందుకు సిపిఐ ఆధ్వర్యంలో ఆగస్ట్ నెలలో పాదయాత్రలు నిర్వహిస్తామని,సెప్టెంబర్ లో ఛలో డిల్లీకి పిలుపునిచ్చినట్లు చాడ వెంకటరెడ్డి తెలిపారు. దేశంలో విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతూ నీట్ పేపర్ లీక్ అయినా దోషులను శిక్షించలేదని,కనీసం నైతిక బాధ్యత వహించి కేంద్ర మంత్రి కూడా రాజీనామా చేయలేదని,లీకేజీపై సమగ్ర విచారణ చేపట్టాలని,బాధ్యులను శిక్షించాలని దిల్లీలో ఆందోళన జరుగుతుంటే చూస్తూ ఊరుకుంటుందని,ఆందోళన కారులపై లాఠీచార్జ్ చేయడం,బస్పవాయువు ప్రయోగించడం దుర్మార్గపు చర్య అని దీనిని సీపీఐ ఖండిస్తుందని,విద్యార్థులతో,నిరుద్యోగులతో చెలగాటం ఆడితే ప్రభుత్వం కుప్పకూలక తప్పదని వెంకటరెడ్డి హెచ్చరించారు.

ఈ సమావేశములో సిపిఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్,రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పొనగంటి కేదారి, జిల్లా కార్యవర్గ సభ్యులు కొయ్యడ సృజన్ కుమార్, బోయిని అశోక్, గూడెం లక్ష్మి, బత్తుల బాబు, టేకుమల్ల సమ్మయ్య, కసిరెడ్డి సురేందర్ రెడ్డి,నాగెల్లి లక్ష్మారెడ్డి, బోయిని తిరుపతి,న్యాలపట్ల రాజు పాల్గొన్నారు.



**బోనాల రాజుకి జన్మదిన శుభాకాంక్షలు**



**విలాసాగర్ దేవయ్యకు జన్మదిన శభాకాంక్షలు**



**అనన్య కు జన్మదిన శుభాకాంక్షలు**

# నీట్ పేపర్ లీకేజీ పై కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలి

**జనసైన్యం సిటి**

ప్రధాని మోదీ మౌనం వీడాలి..శాంతియుత పార్లమెంట్ మార్చ్ చేస్తున్న విద్యార్థుల పై లాఠీచార్జ్ నీ తీవ్రంగా ఖండిస్తున్న - మంత్రి పొన్నం ప్రభాకర్ .

ఢిల్లీలో నీట్ (NEET) పేపర్ లీకేజీ వ్యవహారంపై న్యాయం కోరుతూ శాంతియుతంగా పార్లమెంట్ వైపు మార్చ్ నిర్వహించిన విద్యార్థులు, యువజన సంఘాలపై పోలీసులు లాఠీచార్జ్ చేయడం అత్యంత దురదృష్టకరం, ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్రంగా ఖండించారు.విద్యార్థులు తమ భవిష్యత్తుకు సంబంధించిన న్యాయమైన డిమాండ్లతో శాంతియుతంగా నిరసన వ్యక్తం చేస్తుంటే, వారి గొంతును అణిచివేయడానికి బలప్రయోగం చేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమన్నారు. ప్రశ్నించిన వారిపై లాఠీలు ఎత్తడం కేంద్ర ప్రభుత్వ వైఖరిని ప్రతిబింబిస్తోందని విమర్శించారు.నీట్ పరీక్షల నిర్వహణలో చోటుచేసుకున్న అవకతవకలు, పేపర్ లీకేజీ ఘటనలతో లక్షలాది మంది విద్యార్థులు, వారి కుటుంబాలు తీవ్ర ఆందోళనకు గురయ్యారని అన్నారు. ఈ వ్యవహారానికి రాజకీయ బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని మంత్రి డిమాండ్ చేశారు.దేశ యువత భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిన ఈ పరిస్థితిలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మౌనం ఎందుకు వహిస్తున్నారని ప్రశ్నించారు. దేశ యువతకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత ప్రధానమంత్రిపై ఉందన్నారు.

విద్యార్థులపై నమోదైన కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలని, లాఠీచార్జీకి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, నీట్ పరీక్షల నిర్వహణలో పారదర్శకత, జవాబుదారీతనాన్ని నిర్ధారించేలా కేంద్ర ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని మంత్రి పొన్నం ప్రభాకర్ డిమాండ్ చేశారు.



# రెండు నాలుకల ధోరణి తో విద్యుత్ ఉద్యోగులకు ఇక్కట్లు



**జనసైన్యం సిటి**

విద్యుత్ రంగాన్ని ప్రైవేటీకరించే ప్రయత్నాలను వెంటనే విరమించుకోవాలని విద్యుత్ శాఖ జేఏసీ నాయకులు ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. కేంద్రంలో ప్రతిపక్ష హోదాలో ఉన్నప్పుడు ఒక విధంగా మాట్లాడి, అధికారంలోకి వచ్చిన తర్వాత మరో విధంగా వ్యవహరించడం వల్ల విద్యుత్ ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ రెండు నాలుకల ధోరణి కారణంగా విద్యుత్ రంగ భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారుతోందని పేర్కొన్నారు.జగిత్యాల జిల్లా మెట్ పల్లి డివిజన్ అధ్వర్యంలో సోమవారం విధ్యుత్ కార్యలయం ముందు నల్ల బ్యార్జీలతో నిరసన తెలిపారు.భద్రాచలం విద్యుత్ ప్లాంట్‌తో పాటు,తెలంగాణలోని ఇతర థర్మల్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలను ప్రైవేటు సంస్థలకు అప్పగించే ప్రయత్నాలను విద్యుత్ ఉద్యోగులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారని తెలిపారు. విద్యుత్ రంగం ప్రజా అవసరాలకు సంబంధించిన కీలక రంగమని, దీనిని ప్రైవేటీకరిస్తే వినియోగదారులపై అదనపు భారం పడటమే కాకుండా ఉద్యోగుల భద్రత కూడా ప్రమాదంలో పడుతుందని అన్నారు.ప్రభుత్వాలు విద్యుత్ సంస్థలను ప్రైవేటు చేతుల్లోకి నెట్టే బదులు, వాటి నిర్వహణ బాధ్యతలను ఉద్యోగులకు అప్పగిస్తే ఏడాది వ్యవధిలోనే లాభాల బాట పట్టించి చూపిస్తామని జేఏసీ నాయకులు సవాల్ విసిరారు. ఉద్యోగుల అనుభవం, నైపుణ్యం, అంకితభావం విద్యుత్ రంగాన్ని మరింత బలోపేతం చేస్తాయని వారు పేర్కొన్నారు.తెలంగాణ రాష్ట్రం నీళ్ల నిధులు నియామకాలు అనే ఉద్యమ లక్ష్యాలతో ఏర్పడిందని గుర్తు చేసిన నాయకులు, రాష్ట్ర ఏర్పాటుకు దశాబ్దాలు పోరాడిన యువతకు తగిన ఉద్యోగ అవకాశాలు కల్పించడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయని విమర్శించారు. స్థానిక నిరుద్యోగులకు ప్రాధాన్యత కల్పించాల్సిన చోట ఇతర రాష్ట్రాలకు చెందిన వారికి అవకాశాలు ఎక్కువగా లభిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.విద్యుత్ శాఖలో ఆర్టిజన్, ఏఎన్ఎం, పీఏ, పీసీసీ వంటి విభాగాల్లో ఉద్యోగుల మధ్య వేతనాలు, హోదాలు, సౌకర్యాల్లో వ్యత్యాసాలు ఉన్నాయని, రెండు రకాల విధానాలతో ఉద్యోగులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. సమాన పనికి సమాన వేతనం, ఉద్యోగ భద్రత, పదోన్నతుల విషయంలో ప్రభుత్వం స్పష్టమైన విధానాన్ని ప్రకటించాలని డిమాండ్ చేశారు.భద్రాచలం విద్యుత్ ప్లాంట్ ప్రైవేటీకరణ నిర్ణయాన్ని ప్రభుత్వం వెనక్కి తీసుకోకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. విద్యుత్ రంగాన్ని కాపాడుకోవడం ఉద్యోగులకే కాకుండా ప్రజలందరి బాధ్యత అని పేర్కొన్నారు. ఈ నిరసన కార్యక్రమంలో విద్యుత్ శాఖ జేఏసీ జిల్లా చైర్మన్ ఎండి హజీజ్, డివిజన్ చైర్మన్ మునుగురి లక్ష్మణ్, జేఏసీ కార్యదర్శి జరుపుల హరిప్రసాద్, సామల్ల రవీందర్, బోయినపల్లి అశోక్, జిందం శంకర్, కో-కన్వీనర్ పి. రవి, బొంబాయి రఘుపతి, ఎండి కరీం, జిందం ప్రసాద్, మహేష్, గసికంటి రాము, రాజశేఖర్, జిందం శరణ్య, సాంబరి రష్మిత, లక్ష్మి తదితర విద్యుత్ శాఖ ఉద్యోగులు, సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# భవన నిర్మాణ వెల్ఫేర్ బోర్డు నిధులు ప్రైవేట్ ఇన్సూరెన్స్ వారికి ఇవ్వొద్దు




తెలంగాణ బిల్డింగ్ అండ్ అధర్ కన్స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ CITU ఆధ్వర్యంలో భవన నిర్మాణ సంక్షేమ బోర్డు స్కీములను ఇన్సూరెన్స్ కంపెనీలకు ఇవ్వొద్దు. వెల్ఫేర్ బోర్డు నుండే సంక్షేమ పథకాలు కార్మికులకు అందించాలి. సిఎస్సి సంస్థ హిల్త్ టెస్టులను వెంటనే రద్దు చేయాలి, సహజ మరణానికి నష్టపరిహారం రూ.5 లక్షలకు పెంచాలి. పెండింగ్ క్లెయిమ్సు నిధులు వెంటనే విడుదల చేయాలని కోరుతూ జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేసి జిల్లా కలెక్టర్ గారికి వినతిపత్రం అందచేశారు.యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎడ్ల రమేష్ మాట్లాడుతూ తెలంగాణ భవన మరియు ఇతర నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డు అమలు చేస్తున్న ప్రమాద మరణం, సహజ మరణం, శాశ్వత, పాక్షిక అంగవైకల్యం ఈ మూడు స్కీములను ప్రైవేట్ ఇన్ఫూరెన్స్ కంపెనీల ద్వారా అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం జీవో నెం.12ను జూలై తేది: 22-07-2025న విడుదల చేసింది. జీఓ విడుదల చేసిన వెంటనే ట్రెయిల్ బ్లెజర్ అనే బ్రోకర్స్ సంస్థ ద్వారా రూ.346 కోట్లు ప్రైవేట్ బీమా కంపెనీలకు బదిలీ చేశారు. కార్మికులకు ఎటువంటి ఉపయోగం లేని సిఎస్సి హెల్త్ టెస్టులు చేస్తూ రూ.750 కోట్లకు పైగా సంస్థకు ఇచ్చి వెల్ఫేర్ బోర్డు సెస్సు నిధులు దుబారా చేశారు. కేంద్ర చట్టం, రాష్ట్ర వెల్ఫేర్ బోర్డు నిబంధనలను ఉల్లంఘించి అక్రమంగా ఇన్సూరెన్స్ కంపెనీలకు, సిఎస్సి సంస్థకు వందల కోట్లు కట్టబెట్టడం దుర్మార్గమని అన్నారు.1996 భవన నిర్మాణ కార్మికుల కేంద్ర చట్టం ప్రకారం వెల్ఫేర్ బోర్డు అడ్వైజరీ కమిటీని నియమించి వారి నిర్ణయం ప్రకారమే బోర్డు నిధులను ఖర్చు చేయాలి. కానీ వెల్ఫేర్ బోర్డు అడ్వైజరీ కమిటీని నియమించకుండా ప్రభుత్వం కార్మిక శాఖ అధికారులు కమిషన్లకు కక్కుర్తి పడీ ఎలాంటి గుర్తింపు లేని ఇన్సూరెన్స్ కంపెనీలకు స్కీములను అప్పగించి పేద నిర్మాణ కార్మికుల నోట్లో మట్టిగొడుతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 2009 నుండి 2026 వరకు బోర్డులో నమోదు చేసుకున్న కార్మికులు 28 లక్షల 50 వేల మంది ఉండగా, 15 లక్షల మందిని మాత్రమే రెన్యువల్ చేసి ఒక్కొక్క కార్మికుడికి ప్రీమియం రూ.2,309/-ల చొప్పున 15 లక్షల మంది కార్మికులకు రూ.346.36 కోట్లు ప్రైవేట్ బీమా కంపెనీలకు అప్పనంగా కట్టబెట్టారు. 2025 జూలై 24 నుండి ఇప్పటివరకు ఇస్సూరెన్స్ కంపెనీ వారు కార్మికులకు చెల్లించిన నష్టపరిహారాలు రూ.140 కోట్లు మాత్రమే. సుమారు రూ.200 కోట్లు ఇన్సూరెన్స్ కంపెనీలకు మిగిల్చారు. బోర్డు నుండి డేటా ఇవ్వలేదని సాకు చూపి వేలాది మంది కార్మికులకు నష్టపరిహారాలు ఇవ్వకుండా ఆఫీసుల చుట్టూ తిప్పుకొని వందల కోట్లు ఇన్సూరెన్స్ కంపెనీలు దోచుకున్నాయి. 13 లక్షలకు పైగా కార్మికుల కార్డులు రెన్యువల్ చేయకుండా వారికి అన్యాయం చేస్తున్నారు. వివాహ కానుక, ప్రసూతి కానుక, హాస్పిటల్ ఖర్చులు, దహస సంస్కారాల ఖర్చుల వంటి తదితర స్కీములను ప్రభుత్వం, బోర్డు అధికారులు అనేక కారణాలు చూపి కార్మికులకు అందకుండా చేస్తున్నారు. కార్మికులకు ఇవ్వాల్సిన రూ.54,000 పెండింగ్ నష్టపరిహారాలకు నిధులు సకాలంలో విడుదల చేయకుండా, కొత్త సంక్షేమ పథకాలు పెట్టకుండా. ప్రభుత్వం బోర్డు నిధులను దుబారా చేస్తున్నది.కావున ప్రభుత్వం వెంటనే ఇన్ఫూరెన్స్ కంపెనీలకు ఇచ్చిన అనుమతి మరోసారి కొనసాగించకుండా జీఓ నెం.12ను రద్దు చేసి ప్రభుత్వమే వెల్ఫేర్ బోర్డు ద్వారా కార్మికులకు సంక్షేమ పథకాలు అందించాలి. పెండింగ్లో ఉన్న క్లెయిమ్స్ కు నిధులు వెంటనే విడుదల చేయాలి. రెన్యువల్ కాని 13 లక్షల మంది కార్మికుల లేబర్ కార్డులను యుద్ధప్రాతిపదికన రెన్యువల్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు కదిరే రమేష్, జిల్లా ఉపాధ్యక్షులు పళ్ళ తిరుపతి, జిల్లా కోశాధికారి వట్టి జగదీష్, సైదాపూర్ మండలం అధ్యక్షులు రాధారపు సంపత్,ప్రధాన కార్యదర్శి దొకిడి తిరుపతి,కరీంనగర్ అర్బన్ ప్రెసిడెంట్ మల్లారెడ్డి, ప్రధాన కార్యదర్శి కాల్వ సంపత్,జమ్మికుంట మండలం నాయకులు రాజయ్య, రమేష్, శంకరపట్నం మండల అధ్యక్షులు ఇమ్మడి చక్రపాణి,ఇల్లందకుంట అధ్యక్షులు రేణికుంట సరయ్య, వీణవంక అధ్యక్షులు సుధాకర్ తదితరులు కార్మికులు పాల్గొన్నారు.

## గుమ్లాపూర్ గ్రామంలో ఓటి పెండింగ్ పనులు పూర్తి చేయాలి



**జనసైన్యం సిటి**
చొప్పదండి నియోజకవర్గ ఎమ్మెల్యే డా. మెడిపెల్లి సత్యం గారికి గుమ్లాపూర్ గ్రామ యువత సోమవారం వినతి పత్రం అందజేశారు.గుమ్లాపూర్ గ్రామ అభివృద్ధికి సంబంధించి పెండింగ్‌లో ఉన్న O T పనులను వెంటనే పూర్తి చేయాలని, అదేవిధంగా గ్రామంలో తాగునీరు మరియు సాగునీటి సమస్యలను పరిష్కరించాలని వారు కోరారు. ఈ సందర్భంగా గ్రామ యువత మాట్లాడుతూ, గుమ్లాపూర్ గ్రామ సమగ్ర అభివృద్ధికి OT నిధులతో చేపట్టిన పనులు సకాలంలో పూర్తి కాకపోవడంతో గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ముఖ్యంగా తాగునీటి సరఫరా, సాగునీటి కాలువల మరమ్మత్తు పనులు అత్యవసరమని వారు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు.గ్రామ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించి, పెండింగ్ పనులకు నిధులు మంజూరు చేయించి త్వరగా పూర్తి చేయాలని, గ్రామస్తుల సమస్యలను శాశ్వతంగా పరిష్కరించాలని వారు మీాూ డా. మైపల్లి సత్యంని కోరారు.ఈ కార్యక్రమంలో "గుమ్లాపూర్ భారత రాష్ట్ర సమితి కార్యకర్తలు" వార్డు సభ్యులు కనకం శ్రీనివాస్, పెద్దల్లి శ్యామ్,, బిసవేణి రాజశేఖర్ గౌడ్,, సంకరి మోహన్ యాదవ్, కడారి గంగరాజు, కొమ్ము మల్లేశం,చిర్ర రమేష్ , సంధ్యవేణి రాయమల్లు. సందవేణి తిరుపతి పాల్గొన్నారు.

## ఢిల్లీ జంతర్ మంతర్ విద్యార్థి ఉద్యమానికి మద్దతు



**జనసైన్యం సిటి**
నీట్ పేపర్ లీకేజ్ కు నిరసనంగా కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని ఢిల్లీ జంతర్ మంతర్ వేదికగా నిరసన చేస్తున్న విద్యార్థులకు ప్రజామిత్ర ప్రోగ్రెసివ్ డెమోక్రటిక్ ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షులు కొరివి వేణుగోపాల్ మద్దతు తెలియజేశారు. సోమవారం కరీంనగర్ పట్టణంలో ని గాంధీ విగ్రహం వద్ద ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే స్పందించకపోతే ఈ ఉద్యమం దేశవ్యాప్తంగా ఒక మహా ఉద్యమంగా మారుతుందన్నారు. దీనికి కేంద్ర ప్రభుత్వం బాధ్యత వహించాల్సిన అవసరం ఉందన్నారు. అవసరమైన తగిన చర్యలు తీసుకోవాలన్నారు. కరీంనగర్ బిడ్డలు నీట్, వివిధ పరీక్షలు రాసి నష్టపోయి ఉన్నారు గనుక కరీంనగర్ వాసి మంత్రి పొన్నం ప్రభాకర్ , కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ లు విద్యార్థులకు మద్దతు ప్రకటించాలని విజ్ఞప్తి చేశారు. కరీంనగర్ విద్యార్థులు కూడా గొప్ప నిరసన చేయాలని కోరారు. అందరూ ఐక్య సంఘటనగా ఏర్పడి రాజకీయాలను పక్కనపెట్టి నిస్వార్థంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఈ మీడియా సమావేశంలో చిగిరి శ్రీధర్,కొంపల్లి రవీందర్, శ్రీరాముల కిషన్ బాబు చిలువేరి రవీందర్ లు పాల్గొన్నారు.

## ఢిల్లీలో విద్యార్థులు, యువతపై పోలీసుల లాఠీ-చార్జీ అమానుషం




**జనసైన్యం సిటి**

ఢిల్లీలో తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం చలో పార్లమెంట్ మార్చ్ నిర్వహిస్తున్న విద్యార్థులు, యువతపై పోలీసులు లాఠీచార్జీ చేయడం అత్యంత అమానుషమైన చర్య అని, ప్రజాస్వామ్య దేశంలో నిరసన తెలిపే హక్కు ప్రతి పౌరుడికి రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కు ఉందని, అలాంటి హక్కును అణిచివేసే విధంగా పోలీసులు లాఠీ ఛార్జ్ చేస్తూ, టియర్ గ్యాస్ ప్రయోగించిన విద్యార్థులు యువకులు పార్లమెంట్ ను తాకి నిరసన చెప్పారని, నీట్ పరీక్షను సక్రమంగా నిర్వహించడంలో కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం పూర్తిగా వైపల్యం చెందిందన్నారు, 2024, 2026లో నీట్ పేపర్ లీకేజ్ పరీక్ష ఫలితాల్లో తప్పుల వల్ల లక్షల మంది విద్యార్థుల జీవితాలతో ఎన్టీఏ సంస్థ చెలగాటమాడుతుందని, బిజెపి పాలిత రాష్ట్రాలు ఉత్తర ప్రదేశ్, బిజెపి, గుజరాత్ లోనే వరుసగా పేపర్ లీకేజీలు జరుగుతున్నాయని, పేపర్ లీకేజీలకు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని దేశవ్యాప్తంగా విద్యార్థులు యువకులు డిమాండ్ చేస్తున్న కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుందని, నీటి పరీక్ష నిర్వహణను రాష్ట్రాలకు ఇవ్వకుండా కేంద్రం ఆధీనంలో పెట్టుకొని రాష్ట్రాల హక్కులను కాలరాస్తూ, విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేస్తుందని, ఢిల్లీలో నిరసన తెలుపుతున్న వారిపై లాఠీ చార్జీలు చేయడం కాదు నీట్ పేపర్ లీకేజ్ దోషులను కఠినంగా శిక్షించి, ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయడం ద్వారా విద్యార్థులకు న్యాయం జరుగుతుందని,విద్యార్థులు, యువత సమస్యలను చర్చల ద్వారా పరిష్కరించాల్సింది పోయి వారిపై బలప్రయోగానికి దిగడం కేంద్ర ప్రభుత్వ నిరంకుశ వైఖరికి నిదర్శనం. విద్యార్థుల గొంతును లాఠీలతో మూయాలని చేసే ప్రయత్నాలు ఎప్పటికీ ఫలించవు. ఉద్యమాలను అణచివేయడం వల్ల సమస్యలు పరిష్కారం కావు. ఏఐఎస్ఎఫ్ తెలంగాణ రాష్ట్ర కౌన్సిల్ తరఫున ఢిల్లీ పోలీసుల లాఠీచార్జీని తీవ్రంగా ఖండిస్తున్నాము. గాయపడిన విద్యార్థులకు తక్షణమే మెరుగైన వైద్య సహాయం అందించాలి. ఈ ఘటనకు బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలి. విద్యార్థులు, యువత డిమాండ్లపై కేంద్ర ప్రభుత్వం వెంటనే స్పందించి పరిష్కరించాలని కసిరెడ్డి మణికంఠ రెడ్డి ,పుట్ట లక్ష్మణ్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.

# అక్రిడిటేషన్ జాప్యంపై గళమెత్తిన జర్నలిస్టులు



**జనసైన్యం సిటి**

రాజన్న సిరిసిల్ల జిల్లాలో జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (టీయూడబ్ల్యూజే హెచ్-143) ఉద్యమ కార్యాచరణను మరింత వేగవంతం చేసింది. జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డులు జారీ చేయడంలో జరుగుతున్న జాప్యంపై నిరసన వ్యక్తం చేస్తూ ఈ నెల 21వ తేదీ మంగళవారం ఉదయం 10:30 గంటలకు జిల్లా కలెక్టరేట్ ఎదుట నిర్వహించే "చలో కలెక్టరేట్" కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా అధ్యక్షుడు లాయక్ పాషా పిలుపునిచ్చారు.ఈ మేరకు మంగళవారం ఇల్లంతకుంట మండల ప్రెస్ క్లబ్‌లో టీయూడబ్ల్యూజే హెచ్-143 సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. మండల అధ్యక్షుడు రాజు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు లాయక్ పాషా పాల్గొని సభ్యత్వాలను నమోదు చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం సంఘం నిరంతరం పోరాటం చేస్తుందని అన్నారు. ముఖ్యంగా అక్రిడిటేషన్ కార్డుల జారీ ఆలస్యం కావడంతో జిల్లా వ్యాప్తంగా పనిచేస్తున్న జర్నలిస్టులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ఈ సమస్యను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లేందుకు కలెక్టరేట్ ఎదుట నిరసన నిర్వహించి వినతిపత్రం సమర్పించనున్నట్లు తెలిపారు.జిల్లాలోని అన్ని మండలాలు, పట్టణాల నుంచి జర్నలిస్టులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు. జర్నలిస్టుల హక్కుల సాధనకు ఐక్యతే బలమని, సంఘం చేపట్టే ఉద్యమాలకు ప్రతి పాత్రికేయుడు మద్దతు ఇవ్వాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు పరుశురాం, జిల్లా క్రమశిక్షణ కమిటీ సభ్యుడు రసూల్, జిల్లా కమిటీ సభ్యుడు కమటాల విజయ్, వేములవాడ ప్రధాన కార్యదర్శి అలీ, సీనియర్ పాత్రికేయుడు మోహన్‌తో పాటు పలువురు జర్నలిస్టులు పాల్గొన్నారు.టీయూడబ్ల్యూజే హెచ్-143 జిల్లా వ్యాప్తంగా సభ్యత్వ నమోదు కార్యక్రమాలను నిర్వహిస్తూ ఒకవైపు సంఘాన్ని బలోపేతం చేస్తూనే, మరోవైపు జర్నలిస్టుల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లే ఉద్యమాలకు శ్రీకారం చుట్టడం గమనార్హం. ఇల్లంతకుంటలో నిర్వహించిన సభ్యత్వ నమోదు కార్యక్రమం, వెంటనే చేపట్టనున్న "చలో కలెక్టరేట్" పిలుపు జిల్లాలో జర్నలిస్టుల ఐక్యతను మరింత బలోపేతం చేసే చర్యగా భావించవచ్చు. అక్రిడిటేషన్ కార్డుల జారీ ప్రక్రియ వేగవంతం కావాలని జర్నలిస్టుల నుంచి వస్తున్న డిమాండ్‌కు ఈ నిరసన కార్యక్రమం కీలక వేదికగా మారే అవకాశం ఉంది.

## ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు లైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో చెస్ బోర్డులు మరియు బట్ట సంచులు పంపిణీ.



**జనసైన్యం సిటి**

అంతర్జాతీయ చెస్ దినోత్సవం పురస్కరించుకొని కరీంనగర్ లోని వావిలాలపల్లె ప్రభుత్వ ప్రైమరీ స్కూల్ (G.P.S) పాఠశాలలో లైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు చెస్ బోర్డులు మరియు బట్ట సంచులు అందజేశారు. ఈ సందర్భంగా లైన్స్ క్లబ్ ప్రతినిధులు మాట్లాడుతూ విద్యార్థులకు చిన్ననాటి నుండే చెస్ నేర్పించాలని ఈ ఆటతో మేధాశక్తితో పాటు ఏకాగ్రత క్రమశిక్షణ ఉంటుందని అందుకు తల్లిదండ్రులు చదరంగం ఆటకు మక్కువ చూపించాలని వారు కోరారు. అనంతరం బట్ట సంచులు పంపిణీ చేసి పాఠశాలలో చెట్టు మొక్క నాటారు. ఈ కార్యక్రమంలో లైన్స్ క్లబ్ కరీంనగర్ ఆఫ్ ప్రెసిడెంట్ మ్యాడం శివకాంత్ పటేల్, జోనల్ చైర్మన్ లైన్ ముక్క శరత్ కృష్ణ, సెక్రటరీ లైన్ బట్టు వినోద్, ట్రెజరర్ లైన్ మెతుకు కృష్ణ చైతన్య, జైంట్ ట్రెజరర్ లైన్ ఐత సూరజ్ కుమార్, జీనియస్ చెస్ అకాడమీ డైరెక్టర్ కంకటి అనూప్ కుమార్, తాటి పెల్లి సతీష్ బాబు, ప్రధానోపాధ్యాయురాలు కాపర్తి జ్యోతి లక్ష్మి ఉపాధ్యాయురాలు కె మమత విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు .

# ప్రతి ఇంటిపై సౌర విద్యుత్ ప్లాంట్లను ఏర్పాటు చేసుకోవాలి




**జనసైన్యం సిటి**

పెరుగుతున్న కాలుష్యం, వాతావరణ మార్పులు, ఎల్‌నినో వంటి ప్రకృతి విపత్తులను తగ్గించాలంటే ప్రతి కుటుంబం తమ ఇంటి పైకప్పుపై సౌర విద్యుత్ (సోలార్) ప్లాంట్లను ఏర్పాటు చేసుకోవాలని కరీంనగర్ నగరపాలక సంస్థ మేయర్ కొలగాని శ్రీనివాస్ పిలుపునిచ్చారు.సోమవారం ఉదయం అశోక్‌నగర్ కాలనీలో మానేరు పర్యావరణ సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న మేయర్, సమితి రూపొందించిన అవగాహన కరపత్రాలను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యుత్ ఉత్పత్తికి బొగ్గు, పెట్రోల్, సహజ వాయువులు వంటి ఇంధనాలను అధికంగా వినియోగించడం వల్ల కాలుష్యం పెరిగి పర్యావరణ సమతుల్యత దెబ్బతింటోందని అన్నారు. అయితే సౌర విద్యుత్ ద్వారా ఎలాంటి కాలుష్యం ఉత్పత్తి కాదని, అందుకే దీనిని గ్రీన్ ఎనర్జీ గా పిలుస్తారని పేర్కొన్నారు.ప్రతి ఇంటిపై సోలార్ ప్లాంట్ ఏర్పాటు చేసుకోవడం ద్వారా విద్యుత్ బిల్లుల భారం గణనీయంగా తగ్గడమే కాకుండా, అదనంగా ఉత్పత్తి అయ్యే విద్యుత్‌ను గ్రిడ్‌కు అందించడం ద్వారా ఆర్థిక ప్రయోజనం కూడా పొందవచ్చని తెలిపారు.ఇటీవల కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సూర్య ఘర్ యోజన పథకం ద్వారా గృహాలపై సోలార్ ప్లాంట్ల ఏర్పాటు కోసం సుమారు రూ.80,000 వరకు సబ్సిడీ అందిస్తున్నట్లు మేయర్ వివరించారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకొని పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ వై. సునీల్ రావు , కార్పొరేటర్లు గొట్టేముక్కుల ఉమారాణి వెంకటరమణ, వాసాల రమేష్, వంగల పవన్, కొలిపాక శ్రీనివాస్, మానేరు పర్యావరణ సమితి ప్రతినిధులు తోట లక్ష్మణ్ రావు, గంజి స్వరాజ్ బాబు, కొమురవెల్లి వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

# డబుల్ బేడ్ రూమ్‌ల పనులు పూర్తి చేయాలి




రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలంలో డబుల్ బేడ్ రూమ్ ల పనులు పూర్తి చేయాలని MPDO కార్యలయం ముందు నిరసన చేసిన యువజన సంఘాల నాయకులు. ఇల్లంతకుంట మండల కేంద్రంలో 40 దబుల్ బేడ్ రూమ్ లు గత ప్రభుత్వము నిర్మించినది కానీ వాటి పనులు నీళ్లు లేవు, డ్రైనేజీ లేదు, సెప్టిక్ ట్యాంకు లు లేవు, డోర్స్ విండోస్ పనులు పూర్తి కాకున్నా వాటినీ నలభై కుటుంబాలకు పట్టా ప్రొసీడింగ్స్ గత ఏడాది కాలం లో ఇచ్చారు కానీ ఇప్పటి వరకు కనీస సౌకర్యాలు కల్పించకపోవడంతో ఆ పెద కుటుంబాలు కిరాయి ఇండ్లల్లో వుంటూ అద్దె చెల్లించలేక ఇబ్బందిపడుతున్నారు, ఐనను స్థానిక MLA మండలానికి వచ్చి వెళ్తున్నపుడు కుడా ఎదురుగా కనిపించే అసంపూర్తి డబుల్ బేడ్ రూమ్ లు కనిపించడంలేదా ? డబుల్ బేడ్ రూమ్ లకు నిదులు కేటాయించి బాగుచేయలేరా ఎంఎల్ఏ గారు అంటూ ఎంపీడీవో ఆఫీస్ ముందు నేలపై కూర్చొని నినాదాలతో నిరసన చేశామన్నారు, పట్టాలు పంపిణీ చెసి పది మాసాలు గడుస్తున్నా గృహ ప్రవేశాలకు అనుమతీ లేకపాయె ఎంఎల్ఏ ఈలాగైతే ఎలా సార్ అంటూ నినాదాలు చేశారు, వెంటనే డబుల్ బేడ్ రూమ్ లకు నిదులు ఇచ్చి పూర్తి పనులు చేపించి 30 రోజులలో శ్రావణ మాసంలో లబ్దిదారులను గృహ ప్రవేశాలు కల్పించాలని మీ ద్వారా ఎంఎల్ఏ గారిని డిమాండ్ చేస్తున్నామని వీణా గారికి లేఖను అందించామన్నారు, ఈ నిరసన కార్యక్రమంలో భేంద్రం.తిరుపతి రెడ్డి మండల యువజన సంఘాల అధ్యక్షులు, నాయకులు బొల్లారం. ప్రసన్న కుమార్, బొల్లం.రాంసగర్ , అంతగిరి.అనిల్, భూమల్ల. ప్రశాంత్, ఎల్లేని.శ్రీనివాస్, రొండ్ల.కరుణాకర్ రెడ్డి, గుగ్గిళ్ల.అంజనేయులు, చిట్యాల.శ్రీనివాస్, దుది.శ్రీనివాస్ , కేశవేని.భూమేష్, ఉప్పులేటి. ప్రశాంత్, ఓరుగంటి.చింటూ, కొట్టేపెల్లి.చందు , గొర్రె.శ్రీనివాస్, బిగుళ్ళ.కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# 20వ డివిజన్‌లో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన




కరీంనగర్ నగరపాలక సంస్థ పరిధిలోని 20వ డివిజన్‌లో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి, కరీంనగర్ పార్లమెంట్ సభ్యులు గౌరవ శ్రీ బండి సంజయ్ కుమార్ గారి సహకారంతో రూ.70 లక్షల ఖ×ణఖీ నిధులతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా మేయర్ కొలగాని శ్రీనివాస్ మాట్లాడుతూ, నగర ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే తమ పాలకవర్గ ప్రధాన లక్ష్యమని అన్నారు. పార్టీలకు అతీతంగా ప్రతి డివిజన్‌కు సమాన ప్రాధాన్యతనిస్తూ అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తున్నామని పేర్కొన్నారు. నగర అభివృద్ధి కోసం కేంద్ర, రాష్ట్ర స్థాయిలో అందుబాటులో ఉన్న నిధులను సమర్థవంతంగా వినియోగిస్తూ ప్రజలకు అవసరమైన రహదారులు, డ్రైనేజీలు, ఇతర మౌలిక సదుపాయాలను కల్పించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ , డిప్యూటీ మేయర్ వై. సునీల్ రావు , స్థానిక కార్పొరేటర్ పర్వతం మల్లేశం , 19వ డివిజన్ కార్పొరేటర్ సుధగోని మాధవి కృష్ణ , గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లేశం , ఇతర కార్పొరేటర్లు, మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులు, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

# సర్ తోనే ఓటర్ గా గుర్తింపు




సర్ తోని ఓటరుగా గుర్తింపు పొందడానికి అర్హత సాధించవచ్చు అని, చొప్పదండి నియోజకవర్గం లో ఇప్పటికే 80% సర్ ప్రక్రియ పూర్తయినట్లు ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పేర్కొన్నారు. గంగాధర మండలం మధురానగర్ లో సోమవారం స్పెషల్ ఇంటెన్సీ రివిజన్ ( సర్) కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానికలతో మాట్లాడి సకాలంలో ఎన్యుమరేషన్ ఫారాలను సమర్పించాలని సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరు తమ ఓటు హక్కును నమోదు చేసుకోవాలని సూచించారు. బిఎల్వోల ద్వారా ఇప్పటికే గ్రామాల్లో ఎనీమరేషన్ ఫారాలను అందజేసినట్లు తెలిపారు. ప్రజలు సకాలంలో ఏన్యుమరేషన్ ఫారాలను నింపి బిఎల్వో లకు సహకరించాలని సూచించారు. కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు సర్ ప్రక్రియలో పాల్గొని, ప్రజలకు, బిఎల్ఓ సహకరించాలని సూచించారు. మరణించిన వారి, డబుల్ ఓట్లను తొలగించడానికి సర్ ప్రక్రియ ఉపయోగపడుతుందన్నారు. ప్రతి ఒక్కరు సహకరించి సర్ ప్రక్రియను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ రాము,ఎమ్మార్వో రజిత,మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మంత్రి మహేందర్,మహిళా కాంగ్రెస్ మండల అధ్యక్షురాలు చిరుత మంగ,సింగిల్ విండో చైర్మన్ వెలిచాల తిరుమల్ రావు,జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు పురుమల్ల మనోహర్,మాజీ జెడ్పిటిసి సత్తు కనకయ్య,గునుకొండ బాబు, సర్పంచ్ ల ఫోరమ్ మండల అధ్యక్షులు ముద్దం నగేష్,సర్పంచ్ లు వేముల భాస్కర్,రేండ్ల శ్రీనివాస్, దాసరి శంకరయ్య,లింగాల లింగయ్య,పడాల రాజన్న, యువజన కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షులు వెల్మ క్రిష్ణ రెడ్డి,కాంగ్రెస్ పార్టీ నాయకులు ,ధీకొండ మధు,గుజ్జుల బాపు రెడ్డి,పడితపల్లి కిషన్,కోల ప్రభాకర్,కంకణాల రాజ గోపాల్ రెడ్డి,రొమాల రమేష్, కర్ర బాపు రెడ్డి,రాచమల్ల భాస్కర్,బైరిశెట్టి సంపత్,వేముల అంజి ,చిరుత రమేష్,మెర్గ కొండయ్య,దాతు అంజి,పెంచాల చందు,కోలేపాక మల్లేష్ ,ఉప్పుగండ్ల మోహన్ రెడ్డి,ఉప్పుగండ్ల రామ్ రెడ్డి,పౌల్,రేండ్ల రాజి రెడ్డి,జుర్రు పరశురాం,చిందం రాజు,దులం అంజయ్య,గడ్డం అంజయ్య,జారతి సత్తయ్య,శనిగరపు నర్సయ్య,గంగాధర శ్రీకాంత్,తూము రాజు,దూలం వీరేశం,ఆకుల అంజన్న,గుడి ప్రవీణ్ రెడ్డి,ఏమిరెడ్డి నాగేందర్,గుండవేని తిరుపతి,పిట్టల కమలాకర్ కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

# బాధిత కుటుంబానికి టాటా ఏఐఏ రూ.4.5 కోట్ల బీమా క్లెయిమ్ అందజేత

**జనసైన్యం సిటి**




రోడ్డు ప్రమాదంలో మరణించిన కరీంనగర్‌కు చెందిన పొన్నం శ్రీకాంత్ కుటుంబానికి టాటా ఏఐఏ లైఫ్ ఇన్సూరెన్స్ సంస్థ రూ.4.5 కోట్ల భారీ బీమా పరిహారం అందజేసింది. శ్రీకాంత్ తల్లి, నామినీ అయిన పొన్నం విజయకు సంస్థ క్లస్టర్ హెడ్ వి. వినోద్, ఇతర ప్రతినిధులు గురువారం ఈ చెక్కును పంపిణీ చేశారు. కరీంనగర్ బ్రాంచ్ క్లస్టర్ హెడ్ వి. వినోద్, మేనేజర్లు కొండ ఆదర్శ్ కే. వీరస్వామి లు మాట్లాడుతూ కరీంనగర్‌కు చెందిన పొన్నం శ్రీకాంత్ నవంబర్ 2024లో ఏటా రూ.70 వేల ప్రీమియంతో టాటా ఏఐఏ సంస్థలో టర్మ్ ఇన్సూరెన్స్ పాలసీ తీసుకున్నారు. డిసెంబర్ 2025లో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆయన మరణించగా, సంస్థ వేగంగా స్పందించి క్లెయిమ్ ప్రక్రియ పూర్తి చేసి బాధిత కుటుంబానికి చెక్కు అందజేసింది. జీవితంలో అనుకోని విపత్తులు సంభవించినప్పుడు కుటుంబాలు ఆర్థికంగా రోడ్డున పడకుండా ఉండేందుకు టర్మ్ ఇన్సూరెన్స్ ఎంతో దోహదపడుతుందని తెలిపారు. తక్కువ ప్రీమియంతో ఎక్కువ బీమా రక్షణ లభించే ఇలాంటి పాలసీలు ప్రతి కుటుంబానికి అవసరమని, పిల్లల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ముందస్తుగా బీమా రక్షణ కల్పించుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో లబ్ధిదారురాలు పొన్నం విజయ, క్లస్టర్ మేనేజర్ వి. వినోద్, బ్రాంచ్ మేనేజర్లు కే. వీరస్వామి, కే. ఆదర్శ్, బీఏఎంలు బి. చంద్రశేఖర్, ఆర్. నవీన్,సీనియర్ బ్రాంచ్ ఆపరేషన్స్ జే. మహేందర్, లీగల్ అడ్వైజర్ పులి సాయి తరుణ్ గౌడ్ ఏజెంట్లు పి. రాకేష్, పి.సౌమ్య, పిన్న. సాయికుమార్, బి శ్రీనివాస్ సిహెచ్ విజయ్, బీ మహేష్,ఉష రాణి కత్తి అశోక్, గణేష్, సీనియర్ బిజినెస్ అసోసియేట్ లీడర్లు పాల్గొన్నారు.

# ఐవిఎఫ్ విద్యా సంస్థలలో ఘనంగా నాయకత్వ విలువలకు ప్రతీకగా పట్టాభిషేక వేడుకలు

కరీంనగర్ సీతారాంపూర్ లోని IVY ( CBSE ) విద్యా సంస్థలో విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు, బాధ్యతాయుత భావన, క్రమశిక్షణ, సేవా దృక్పథాన్ని పెంపొందించే లక్ష్యంతో Investiture Ceremony-2026 వైభవంగా నిర్వహించారు. పాఠశాల వ్యవస్థాపకులు పసుల మహేష్ గారు , డైరెక్టర్ పసుల జయశ్రీ, గారు కో-చైర్మన్ దాసరి శ్రీపాల్ రెడ్డి, గారు ప్రిన్సిపాల్ కె. లలిత గారు కోల మాలతి గారు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. గణేష కౌత్వం తో కార్యక్రమం ప్రారంభమైంది . ఇటీవలే స్టూడెంట్ కౌన్సిల్ ఎన్నికలలోనూతనంగా ఎన్నికైన School President, Vice President, Academic Delegates, Cultural Delegates, Sports Delegates, వివిధ House Captainం కు బ్యాడ్జ్లు , మరియు Academic star of the year , మరియు go Green team , community team , Field trip team , digital team , student learning team , technology team , వివిధ టీం ల విద్యార్థులకు బ్యాడ్జ్ లు ప్రదానం చేసి వారికి బాధ్యతలు అప్పగించారు. అనంతరం విద్యార్థులు నాయకత్వ ప్రమాణం చేసి పాఠశాల అభివృద్ధికి అంకితభావంతో పనిచేస్తామని ప్రతిజ్ఞ చేశారు.వివిధ హౌస్‌ల విద్యార్థులు తమ జెండాలతో నిర్వహించిన మీుతీఎష్ట్ర ూఘర్ క్రమశిక్షణ, ఐక్యత, జట్టు స్ఫూర్తిని ప్రతిబింబిస్తూ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. రంగురంగుల అలంకరణల మధ్య క్యాంపస్ పండుగ వాతావరణాన్ని తలపించగా, విద్యార్థుల ఉత్సాహం కార్యక్రమానికి మరింత శోభను చేకూర్చింది. అనంతరం పదవ తరగతి విద్యార్థులు శక్తిసామర్థ్యాల ప్రదర్శనలో భాగంగా ఐక్యతకు ప్రతీకైన మానవ పిరమిడ్ ను ప్రదర్శించారు , ఈ సందర్భంగా పాఠశాల వ్యవస్థాపకులు పసుల మహేష్ , కో చైర్మన్ దాసరి శ్రీ పాల్ రెడ్డి మాట్లాడుతూ, నాయకత్వం అనేది హోదా కాదని, బాధ్యతతో సేవ చేసే అవకాశమని , విలువలతో కూడిన నాయకులుగా ఎదగాలని ఆకాంక్షించారు. సమయపాలన విద్యార్థి విజయానికి పునాదులని వివరించారు. ప్రిన్సిపాల్ కె. లలిత , మాలతి నూతన నాయకత్వ బృందానికి శుభాకాంక్షలు తెలియజేస్తూ, పాఠశాల అభివృద్ధిలో ఆదర్శంగా నిలవాలని సూచించారు.కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొని నూతన నాయకత్వ బృందాన్ని అభినందించారు.









